# విశాల భారతి

24-07-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 199


## కాంగ్రెస్ హయాంలో 53 లీకులు



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వ్యాఖ్యలు
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 53 పేపర్ లీకులు
- యూపీఏ హయాంలో జాతీయ స్థాయిలో 15 సార్లు లీక్
- విద్యాశాఖ మంత్రులు రాజీనామా చేయలేదని ప్రశ్న
- దేశాన్ని బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం
- వివిధ రాష్ట్రాల్లో జరిగిన లీకేజీల గణాంకాలు వెల్లడి

02

## నేను రెడీ.. రేవంత్ రెడ్డి సిద్ధమేనా..?



- గ్లోబ్ ఏరినా సంస్థతో తనకి ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ స్పష్టం
- సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలపై ఏ విచారణకైనా సిద్ధమన్నారు
- తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు రేవంత్ రెడ్డికి ఇప్పటికే లీగల్ నోటీసులు
- రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఒక మూట, బీజేపీకి మరో మూట పంపిస్తున్నారు
- పేపర్ లీకేజీ అంశంలో ప్రధాని మోదీని చూస్తే రేవంత్‌కు భయమని ఎద్దేవా చేశారు

02



## విద్యా సంస్థలు బంద్

- నీట్ పేపర్ లీకేజీ
- విద్యాసంస్థల బంద్ పిలుపు
- కేంద్రం బాధ్యత వహించాలి
- మంత్రి రాజీనామా డిమాండ్
- ఎన్టీఏ రద్దు చేయాలి
- విద్యార్థులపై లాఠీఛార్జ్ ఖండన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** జాతీయ స్థాయిలో తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై దేశవ్యాప్తంగా నిరసనల హోరు కొనసాగుతోంది. ఈ నీట్ పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు వివిధ విద్యార్థి సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. నీట్ పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ తదితర సంఘాలు తీవ్రంగా డిమాండ్ చేశాయి. దేశంలోని కోలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని విద్యార్థి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగ యువత అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలను నిరసిస్తూ దానికి మద్దతుగా గత కొద్ది రోజుల నుంచి దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు తీవ్ర ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. శాంతియుతంగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్న విద్యార్థులపై అక్కడి పోలీసులు అత్యంత అమానుషంగా లాఠీఛార్జ్ చేశారు. పోలీసుల ఈ దుశ్చర్యను తెలంగాణలోని ఆయా విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ఈ బంద్‌కు అన్ని విద్యాసంస్థలు సంపూర్ణంగా సహకరించి, నీట్ విద్యార్థులకు తమ మద్దతు

మిగతా 2లో..




## కదం తొక్కిన ఉస్మానియా..!

- జంతర్‌మంతర్ దాడికి వ్యతిరేకంగా ఉస్మానియాలో నిరసన
- ఆర్ట్స్ కాలేజీ వద్ద భారీగా తరలివచ్చిన విద్యార్థులు
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్
- ప్రధాని నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహించాలని నినాదాలు
- నీట్ లీకేజీ కుంభకోణంపై కఠిన చర్యలకు డిమాండ్
- బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఢిల్లీలోని చారిత్రాత్మక జంతర్‌మంతర్ ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన అత్యంత పాశవిక దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్తిగా భగ్గుమంది. దేశ రాజధానిలో జరిగిన ఈ అమానుష ఘటనపై ఉస్మానియా విద్యార్థి లోకం ఏకమై కదం తొక్కింది. క్యాంపస్‌లోని ప్రధాన కేంద్రమైన ఆర్ట్స్ కాలేజీ వద్దకు వేలాదిగా విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ప్రదర్శనగా చేరుకున్నారు. అక్కడ రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ అణచివేత ధోరణికి వ్యతిరేకంగా గొంతులెత్తి గర్జించారు. దేశంలో విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్న పాలకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల ఆగ్రహ జ్వాలలు ఇక్కడ ప్రదర్శితమయ్యాయి. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ తీరును ఎదిరిస్తూ నినాదాలతో క్యాంపస్ దద్దరిల్లింది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేసిన ఈ నిరసన ఉవ్వెత్తున ఎగసిపడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంచలనం

మిగతా 3లో..

# పిచ్చి వేషాలేస్తే మెంటల్ ఆసుపత్రికే

## రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు



- హరీశ్ రావుపై తీవ్ర విమర్శలు
- మేడిగడ్డపై సీబీఐ విచారణ
- ఎస్ఐఆర్ ఓటర్ల ప్రక్షాళన
- కాంగ్రెస్ శ్రేణుల అప్రమత్తత
- కొడంగల్‌కు ఓటు బదిలీ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయ రంగస్థలంలో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారం మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్ రావుపై నిప్పులు చెరిగారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన భారీ కుంభకోణాలను ఒక్కొక్కటిగా బయట పెడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొట్టారని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు తెలియకుండానే వందల కోట్ల రూపాయల ముడుపులు చేతులు మారాయని బాంబు పేల్చారు. ఈ అవినీతి వ్యవహారంపై బీఆర్ఎస్ నేతలు ప్రజలకు బహిరంగంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని దోచుకున్న చరిత్ర వారిదేనని ఘాటుగా విమర్శించారు. గత ప్రభుత్వ హసాంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన హరీశ్ రావు కన్నెపల్లి పంపుహౌస్ నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. అయితే ఈ ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఇష్టానుసారంగా నిధులు దండుకున్నారని ఆరోపించారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సైతం మోసం చేస్తూ హరీశ్ రావు భారీగా కమీషన్లు నొక్కేసారని తెలిపారు. ఈ దైవద్రోహం లాంటి అవినీతి బాగోతం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఆ కోపంతోనే హరీశ్ రావుకు కొంతకాలం పాటు మంత్రి పదవి ఇవ్వకుండా

మిగతా 2లో..



## రంగనాథ్‌కు గండం!

- హైడ్రాకు హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది
- లోతుకుంట భూముల వివాదంలో అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం
- కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం
- ఆర్మీ భూముల జోలికి వస్తే సంకెళ్లు వేయాలని ఆదేశం
- చట్టానికి ఎవరూ అతీతులు కారని హెచ్చరిక
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ నగరంలో చెరువులు అలాగే ప్రభుత్వ భూముల పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా వ్యవస్థ తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో మండిపడింది. సికింద్రాబాద్ పరిధిలోని లోతుకుంట ప్రాంతంలో ఉన్న సర్వే నంబర్

మిగతా 3లో..



## పాలమూరు-రంగారెడ్డికి షాక్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర జలశక్తి శాఖ పూర్తిగా తిరస్కరించింది. ఈ మేరకు సంబంధిత డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపినట్లు కేంద్రం స్పష్టం చేసింది.

- పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్‌ను కేంద్రం తిరస్కరించి వెనక్కి పంపింది
- దేశంలో కొత్తగా ఏ ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇచ్చే అవకాశం లేదని స్పష్టం
- జాతీయ హోదా రాకపోవడంతో ప్రాజెక్ట్ ఖర్చు మొత్తం రాష్ట్ర ప్రభుత్వానిదే
- సమగ్ర ప్రణాళికతో కొత్త ప్రతిపాదనలు పంపాలన్న కేంద్ర జల సంఘం
- ఎంపీ మల్లు రవి ప్రశ్నకు కేంద్ర మంత్రి రాజ్ భూషణ్ చౌదరి సమాధానం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రాజెక్టు ద్వారా క్షేత్ర స్థాయిలో ఆశించిన పూర్తి ప్రయోజనాలు ప్రజలకు అందాలంటే మరింత స్పష్టమైన సమగ్ర ప్రణాళికలతో కూడిన కొత్త ప్రతిపాదనలను మళ్లీ తయారు చేసి సమర్పించాలని కేంద్ర జల సంఘం తేల్చి చెప్పింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుకు కూడా జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే ఆలోచన గాని ఎలాంటి ప్రతిపాదనలు గాని

మిగతా 2లో..




## ప్రభుత్వ భూమిని మింగేస్తున్న భూ మాఫియా..!

- ఆస్పత్రి ఎదురుగా అక్రమ వెంచర్ కలకలం
- కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు
- అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారా..?
- సమగ్ర విచారణ చేసి భూమిని స్వాధీనం చేసుకోవాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మిరియాల శ్రీనివాస్

04

## కరెంట్ కోతలు.. సాగు కష్టాలు!

- వర్షా భావంతో ఇబ్బందులు
- కరెంటు కోతలతో గోస
- ఎండుతున్న వరి నార్లు
- రోడ్డెక్కిన అన్నదాతలు
- అధికారుల నిర్లక్ష్యం
- ట్రాన్స్‌ఫార్మర్ల కాలిపోక

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అసలే ఎల్‌నినో తీవ్ర ప్రభావంతో ఆకాశం మేఘావృతమైనప్పటికీ వర్షాలు కురవక రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మరోవైపు బోర్లు అలాగే బావుల కింద నారుమళ్లు సిద్ధం చేసుకుని నాట్లు వేసేందుకు రైతులు సర్వసన్నద్ధమవుతుండగా విద్యుత్ సరఫరాలో అప్రకటిత కోతలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తరచూ వస్తున్న ట్రిప్పింగ్‌లతో అన్నదాతల కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి.

మిగతా 3లో..



# నేను రెడీ.. రేవంత్ రెడ్డి సిద్ధమేనా..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హనుమకొండ పర్యటనలో భాగంగా మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపిన గ్లోబ్ ఏరినా సంస్థ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. ఆ సంస్థ తమ కుటుంబానికి చెందిన బినామీ సంస్థ కాదని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఏ రకమైన విచారణనైనా ఎదుర్కొనేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకు కూడా వెళ్లేందుకు వెనుకాడనని ధైర్యంగా సవాల్ విసిరారు. ఇప్పటికే తనపై నిరాధార ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రికి లీగల్ నోటీసులు పంపించినట్లు వెల్లడించారు. తానే స్వయంగా ఈ విషయంలో కోర్టును ఆశ్రయించానని గుర్తు చేశారు. అసలు గ్లోబ్ ఏరినా సంస్థతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే నేటికీ ఒప్పందాలు కుదుర్చుకుంటోందని వివరించారు. ఒకవేళ ఆ సంస్థ తమదే అయితే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎలా ఒప్పందాలు చేసుకుంటుందని ఆయన సూటిగా నిలదీశారు. సీఎం చేస్తున్న వ్యాఖ్యలు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ప్రజలు గమనిస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ నాయకత్వంతో రహస్య సంబంధాలు ఉన్నాయని కేటీఆర్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి నిత్యం కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఒక ఆర్థిక మూటను పంపిస్తూనే, మరోవైపు బీజేపీ పెద్దలకు కూడా మరో మూటను చేరవేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని మోసం చేస్తూ బీజేపీతో చీకటి ఒప్పందాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కుటుంబం చేస్తున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి ఈ అవినీతి ఆరోపణలపై సిట్ లేదా సీఐడీ విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. తాము మాత్రం ఏ విచారణనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. రేవంత్ రెడ్డి అవినీతి బాగోతాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వంలోని పెద్దల ఇష్టారాజ్యమైన నిర్ణయాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని చూస్తే సీఎం రేవంత్ రెడ్డికి విపరీతమైన భయం పట్టుకుందని కేటీఆర్ విమర్శించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి ఒక్కసారైనా నిలదీయలేకపోయారని గుర్తు చేశారు. కనీసం ప్రధాని మోదీ పేరును కూడా బహిరంగంగా ప్రస్తావించే సాహసం చేయలేదని ఎద్దేవా చేశారు. మోదీ అంటే గడగడలాడిపోయే రేవంత్ రెడ్డి, కేంద్రంపై పోరాటం చేస్తున్నట్లు కేవలం నటనాత్మక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగుల పక్షాన లోక్ భవన్ ముందు నిర్వహించాల్సిన భారీ ధర్నాను ఎక్కడో మారుమూల కొడంగల్‌లో చేయడమంటే కేవలం రాజకీయ నాటకం మాత్రమేనని అన్నారు. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి డ్రామాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంతో జరిగిన పాత కేసుల భయం కారణంగానే రేవంత్ రెడ్డి రాజీ పడుతున్నారని ఆరోపించారు. ఇతర కాంట్రాక్టులలో ప్రయోజనాలు పొందేందుకే కేంద్ర నాయకత్వానికి తలవంచుతున్నారని ఘాటుగా విమర్శించారు.



రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేక ప్రజల ముందు దోషిగా నిలబడిందని అన్నారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మాని ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఎదిరిస్తుందని స్పష్టం చేశారు. ప్రతి అంశంలోనూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల గొంతుకగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో అస్తవ్యస్త విధానాల వల్ల అన్నదాతలు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. ఇచ్చిన ప్రతీ మాటకు కట్టుబడి ఉంటామని చెబుతున్న సర్కార్, క్షేత్రస్థాయిలో మాత్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రజలు త్వరలోనే కాంగ్రెస్ పార్టీ మోసాలను గ్రహించి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ అభివృద్ధిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో అంకితభావంతో ముందుకు తీసుకువెళ్లిందని కేటీఆర్ పునరుద్ఘాటించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచాయని కొనియాడారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఆ అభివృద్ధిని విస్మరించి కేవలం కక్షసాధింపు రాజకీయాలకే పరిమితమయ్యారని ఆరోపించారు. అభివృద్ధి పనులను అర్ధాంతరంగా నిలిపివేసి రాష్ట్ర ప్రగతిని వెనక్కి లాగుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు కూడా పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామిక వర్గాల్లో కూడా అభద్రతాభావం నెలకొందని హెచ్చరించారు. ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన హైదరాబాద్ ఖ్యాతిని మసకబారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో అనుభవం లేకపోవడం వల్లనే పరిపాలన గాడితప్పిందని విశ్లేషించారు. అధికారులు కూడా ప్రభుత్వ ఒత్తిళ్లతో సతమతమవుతున్నారని తెలిపారు. రాబోయే కాలంలో ప్రజలక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కూడా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఒకవైపు బీజేపీతో లాలూచీ రాజకీయాలు చేస్తూనే మరోవైపు రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన మోసానికి పాల్పడుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేకపోతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే తత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని తేల్చిచెప్పారు. రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల మద్దతుతో వాటిని తిప్పికొడతామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రభుత్వ మోసాలను మరింత బలంగా ఎత్తిచూపుతామని ముగించారు. హనుమకొండ పర్యటన ముగింపు సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా ఆయన ప్రసంగం సాగిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ప్రజల ఆగ్రహాగ్నికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేటీఆర్ చేసిన సవాల్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఏ విధంగా స్పందిస్తారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది. రానున్న రోజుల్లో ఈ వివాదం మరింత ముదిరే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ అవినీతి లీలలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రణాళికలు రచిస్తున్నారు.

# విద్యా సంస్థలు బంద్

**మొదటిపేజీ తరువాయి**

తెలపాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బంద్‌లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోందని స్పష్టం చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై కూడా తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. దేశంలో ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షలు సరిగా నిర్వహించకుండా నిరంతరం ప్రశ్నాపత్రాల లీకేజీకి ప్రధాన కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ఎన్టీఏను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కోట్లాది రూపాయలు వసూలు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నా పారదర్శకత కరువైందని మండిపడ్డారు. అలాగే నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన దోషులను గుర్తించి కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పునరుద్ఘాటించారు. శాంతియుత ఆందోళనలలో పాల్గొన్న విద్యార్థులపై అక్రమంగా పెట్టిన బనాయించిన తప్పుడు కేసులు అన్నీ వెంటనే బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లన్నీ ప్రభుత్వం అంగీకరించేలా ఒత్తిడి తీసుకొచ్చేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు అంతా కలిసికట్టుగా సహకరించాలని విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ సమస్యపై ప్రభుత్వాల వైఖరి మరువలేనిదని విమర్శించారు. అందులో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌కు అందరూ సంపూర్ణంగా సహకరించాలని కోరారు. దీని కోసం ప్రభుత్వ రంగ విద్యాసంస్థలు, ప్రైవేటు విద్యాసంస్థలు అన్నీ కూడా పూర్తిగా బంద్ పాటించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఒకవేళ బంద్‌ను పాటించకుండా విద్యాసంస్థలు తెరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. విద్యార్థుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని యాజమాన్యాలకు స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అన్నీ స్వచ్ఛందంగా మూసివేసి ప్రభుత్వానికి హెచ్చరిక పంపాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అన్యాయాన్ని ఎదిరించడంలో యువత ఎప్పుడూ ముందే ఉంటుందని నిరూపించాలని కోరారు. విద్యా రంగాన్ని భ్రష్టుపట్టిస్తున్న పాలకులకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని విద్యార్థి నేతలు పేర్కొన్నారు. విద్యాసంస్థల యజమాన్యాలు ఈ సమ్మెను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేవలం చిన్నస్థాయి అధికారులను బలిచేసి ప్రధాన నిందితులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, వారి శ్రమను దొంగలించే ముఠాలు బయటపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు డాక్టర్ అయ్యే కల కల్లగా మారుతోందని వాపోయారు. ఎన్టీఏ వ్యవస్థలో సమూల జరగాలని మేధావులు కూడా అభిప్రాయపడుతున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే ఏ ప్రభుత్వమైనా కాలగర్భంలో కలవడం తథ్యమని హెచ్చరించారు. రేపటి బంద్ విజయవంతం కావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. తెలంగాణ గడ్డపై విద్యార్థి లోకం ఎప్పుడూ ఉద్యమాలకు వెనుకాడదని ఈ బంద్ ద్వారా మరోసారి నిరూపించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని విద్యార్థి సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చి ఈ పోరాటం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.



# కాంగ్రెస్ హయాంలో 53 లీకులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీజేపీ అధికారంలోకి రాకముందు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో జరిగిన పరీక్షా పత్రాల లీకేజీల అంశంపై రాజకీయంగా తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పేపర్ లీకేజీల ఘటనలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వివరంగా ప్రస్తావించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో మొత్తం యాభై మూడు సార్లు పేపర్లు లీక్ అయ్యాయని ఆయన స్పష్టం చేశారు. ఎగ్జామ్ పేపర్ లీక్ చేసిన వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కూడా ఉన్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో ప్రతిపక్షాలు ఈ అంశంపై రాద్ధాంతం చేస్తూ రాష్ట్రాన్ని అలాగే దేశాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన తప్పులను ఎత్తిచూపుతూ కాంగ్రెస్ నాయకుల ద్వంద్వ వైఖరిని ఆయన తీవ్రంగా విమర్శించారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన ఈ అక్రమాలపై అప్పట్లో ఎలాంటి నైతిక బాధ్యత వహించలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాలలో ఇన్నిసార్లు పేపర్లు లీక్ అయినప్పటికీ ఆయా సమయాలలో ఏ ఒక్క విద్యాశాఖ మంత్రైనా తన పదవికి రాజీనామా చేశారా అని ఆయన సూటిగా నిలదీశారు. జాతీయ స్థాయిలో యూపీఏ హయాంలో పదిహేను సార్లు పేపర్లు లీక్ అయ్యాయని ఆయన లెక్కలతో సహా వివరించారు. లీకేజీల సమయంలో బాధ్యులైన మంత్రులు తప్పుకోవాలని కోరని వారు, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఇండియా అలయన్స్ కూటమిలో ఎవరు ఎవరితో ఉన్నారో స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ఈ విషయాలపై సరైన రీతిలో ఎందుకు మాట్లాడటం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ అంశాన్ని పదే పదే తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. రెండు వేల పద్నాలుగు సంవత్సరాలకు ముందు కాంగ్రెస్ హయాంలోని పేపర్ లీకేజీ ఘటనలను రాంచందర్ రావు స్పష్టంగా వివరించారు. పశ్చిమ బెంగాల్ లో టీఎంసీ పరిపాలనలో ఏడు పేపర్లు లీకేజీ అయ్యాయని ఆయన తెలిపారు. అదేవిధంగా తమిళనాడులో ఏఐడీఎంకే హయాంలో మరో ఏడు లీకేజీలు జరిగినట్లు ఆయన స్పష్టం చేశారు. ఒరిస్సాలోని బీజేడీ ప్రభుత్వ హయాంలో ఆరు పేపర్ లీకేజీ ఘటనలు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఆరు లీకేజీలు జరిగాయని ఆయన తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఎస్పీ పార్టీ హయాంలో మూడు పేపర్ లీకేజీలు సంభవించాయని ఆయన వెల్లడించారు. నాగాలాండ్‌లో ఎన్పీఎఫ్ హయాంలో మూడు లీకేజీలు జరిగినట్లు ఆయన వివరించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రెండు లీకేజీలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. సిక్కిం రాష్ట్రంలో కూడా రెండు పేపర్ లీకేజీల ఘటనలు నమోదయ్యాయని ఆయన స్పష్టం చేయడం జరిగింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సీపీఎం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రెండు లీకేజీలు సంభవించాయని ఆయన తెలిపారు. ఝార్ఖండ్ లో జేఎంఎం పార్టీ హయాంలో మరో రెండు లీకేజీలు జరిగినట్లు ఆయన వెల్లడించారు. తమిళనాడులో డీఎంకే పార్టీ హయాంలో రెండు లీకేజీలు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ హయాంలో ఒక లీకేజీ జరిగిందని ఆయన చెప్పారు. ఎన్సీపీ హయాంలో ఒక లీకేజీ ఘటన నమోదైందని ఆయన వివరించారు. మిజోరాంలో ఎమ్ఎన్ఎఫ్ హయాంలో ఒక పేపర్ లీకేజీ జరిగిందని ఆయన తెలిపారు. యునైటెడ్ ఫ్రంట్ ఫెడరేషన్ పాలనలో ఒక లీకేజీ సంభవించిందని ఆయన గుర్తు చేశారు. నాగాలాండ్ రాష్ట్రంలో డీఏఎన్ హయాంలో ఒక లీకేజీ జరిగినట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో రాష్ట్రపతి పాలన అమలులో ఉన్న సమయంలో కూడా ఒక పేపర్ లీకేజీ జరిగిందని ఆయన వివరంగా గణాంకాలను బయటపెట్టారు. దేశవ్యాప్తంగా వివిధ కాలాల్లో వివిధ రాజకీయ పార్టీల హయాంలో విద్యా వ్యవస్థలో జరిగిన లోపాలను ఆయన ఎత్తిచూపారు. ఏ ఒక్క పార్టీ కూడా ఈ సమస్యకు అతీతం కాదని ఆయన తన ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. విద్యార్థుల భవితవ్యాన్ని దెబ్బతీసేలా కొందరు నాయకులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేవలం బీజేపీని లక్ష్యంగా చేసుకుని విపక్షాలు చేస్తున్న ఆరోపణలలో ఎలాంటి నైతికత లేదని ఆయన అభిప్రాయపడ్డారు. గత చరిత్రను మరుగనొక్కి వర్తమానంలో అనవసర రాద్ధాంతం చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రభుత్వాలను అస్థిరపరం చేయాలనే కుట్రలో భాగంగానే ఈ లీకేజీల అంశాన్ని భూతద్దంలో చూపుతున్నారని ఆయన విమర్శించారు. విద్యా రంగాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. భావితరాల భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. గతంలో జరిగిన ఘటనలపై అప్పట్లో ఎలాంటి కఠిన చర్యలు తీసుకోని వారు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు. విద్యాశాఖ పట్ల చిత్తశుద్ధి లేనివారు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాల విమర్శలలో పస లేదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పారదర్శకతతో ముందుకు వెళ్తుంటే దాన్ని ఓర్వలేక ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. దేశ ప్రగతిని ఓర్వలేని కొందరు నాయకులు యువతను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత యువతపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కాలమే అన్నింటికి తగిన సమాధానం చెబుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాల వారీగా జరిగిన లీకేజీల పూర్తి జాబితాను ప్రజల ముందు ఉంచడం ద్వారా వాస్తవాలు ఏమిటో తేటతెల్లం చేశామని ఆయన చెప్పారు. విపక్షాల అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధికి అడ్డు తగులుతున్న శక్తులను ప్రజలు తిరస్కరించాలని ఆయన కోరారు. రాబోయే కాలంలో విద్యా వ్యవస్థ మరింత పటిష్టంగా మారుతుందని ఆయన భరోసా ఇచ్చారు. ఎలాంటి లోపాలకు తావు లేకుండా సంస్కరణలు అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశానికి ఎంతో మేలు చేస్తున్నాయని ఆయన చెప్పారు. విపక్షాల కుట్రలు ఎప్పటికీ ఫలించవని ఆయన స్పష్టం చేశారు.





## 'చాగంటి రాక .. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

**ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

**విశాలభారతి, నిజామాబాద్:** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని భూమారెడ్డి కన్వెన్షన్, బోర్గాంలో ఇందూరు గోసేవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న "గోమాత వైభవం" ఆధ్యాత్మిక కార్యక్రమానికి విచ్చేస్తున్న ప్రముఖ ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారికి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు తెలిపిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి.. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులకు విస్తృత సూచనలు చేశారు. ఈ సందర్భంగా గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఎమ్మెల్యే మాట్లాడుతూ,. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి ప్రవచనాలను వినేందుకు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ముఖ్యంగా మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత వంటి మౌలిక వసతులను సమకూర్చాలని సూచించారు.

# పాలమూరు–రంగారెడ్డికి షాక్

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా స్పష్టం చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన నీటి పారుదల ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించే ప్రభుత్వ విధానంపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి కొన్ని కీలకమైన ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం తరఫున మంత్రి రాజ్ భూషణ్ చౌదరి రాతపూర్వక సమాధానాలు అందజేశారు. జాతీయ ప్రాజెక్టుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిర్దిష్ట నిబంధనల ప్రకారమే జరుగుతుందని ఆయన తెలిపారు. అంతర్రాష్ట్ర జల వివాదాలతో ముడిపడి ఉన్న ప్రాజెక్టులకు అలాగే భారీ ఎత్తున సాగునీటి భద్రత కల్పించే అత్యంత కీలకమైన భారీ ప్రాజెక్టులకు మాత్రమే నిబంధనల ప్రకారం ఈ హోదా ఇస్తామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా కొత్తగా జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే అవకాశం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతంలోని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తమకు అందిందని చెప్పారు. అయితే ఈ ప్రాజెక్టు ద్వారా ఆశించిన స్థాయిలో పూర్తి ప్రయోజనాలు లభించాలంటే సమగ్ర ప్రణాళిక చాలా అవసరమని పేర్కొంటూ సీడబ్ల్యూసీ ఈ డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిందని వివరించారు. ఈ పరిణామంపై తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందనే అంశంపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రూ. లక్ష కోట్లకు పైగా అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా వస్తే కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ఆశించింది. కానీ కేంద్రం తాజా నిర్ణయంతో రాష్ట్ర వాటా నిధులపై భారం మరింత పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మహబూబ్ నగర్ రంగారెడ్డి నల్గొండ వికారాబాద్ తో పాటు వివిధ జిల్లాల్లోని సుమారు పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. కేవలం సాగునీరు మాత్రమే కాకుండా వందలాది గ్రామాలకు తాగునీరు అందించే బృహత్ లక్ష్యంతో ఈ భారీ ఎత్తిపోతల పథకం నిర్మాణం కొనసాగుతోంది. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి నీటి కేటాయింపులు ఇతర రాష్ట్రాలతో ఉన్న అభ్యంతరాలు వంటి అంశాలపై కేంద్ర జల సంఘం అనేకసార్లు స్పష్టత కోరింది. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం సుమారు ముప్పై ఐదు శాతం పెరిగినట్లు లెక్కలు చూపుతున్నాయి. రిజర్వాయర్ల సామర్థ్యం పంపుహౌస్‌ల ఏర్పాటు విద్యుత్ వినియోగం వంటి అంశాలపై సాంకేతికపరమైన అభ్యంతరాలు వ్యక్తం కావడంతో డీపీఆర్ ఆమోదం పొందడంలో తీవ్రమైన జాప్యం జరుగుతూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉంది. జాతీయ హోదా లభిస్తే తొంభై శాతం నిధులు కేంద్రమే గ్రాంటు రూపంలో ఇస్తుందని తెలంగాణ ప్రభుత్వం గట్టిగా ఆశించింది. కానీ ఇప్పుడు ఆ అవకాశం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే సొంత వనరుల ద్వారా లేదా భారీ రుణాలు సేకరించి ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ సాగునీరు ప్రాజెక్టుల కోసం వేల కోట్ల రూపాయల అప్పులు చేయగా పాలమూరు ప్రాజెక్టు భారం మరో పెద్ద సవాలుగా మారింది. నిపుణుల కమిటీ సూచనల ప్రకారం కొత్త ప్రతిపాదనలు తయారు చేసి మళ్లీ కేంద్రానికి సమర్పించడమే కాకుండా పెండింగ్ అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన లడాయి చేయాల్సి వస్తుంది. కేంద్ర జలశక్తి శాఖ పార్లమెంట్‌లో వెల్లడించిన లెక్కల ప్రకారం దేశంలో ఇప్పటివరకు కేవలం కొన్ని ప్రత్యేక ప్రాజెక్టులకు మాత్రమే జాతీయ హోదా దక్కింది. ప్రత్యేకంగా విభజన చట్టం హామీల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా లభించి కేంద్రమే పూర్తి నిధులు ఇస్తోంది. అయితే తెలంగాణలో ఏ ప్రాజెక్టుకు కూడా ఇప్పటివరకు జాతీయ హోదా దక్కకపోవడం గమనార్హం. కాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా గతంలో జాతీయ హోదా కోరినప్పటికీ అనేక సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. ఇప్పుడు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కూడా అదే తరహా నిరాశ ఎదురుకావడంతో రాష్ట్రంలోని రాజకీయ వర్గాల్లో తీవ్రమైన చర్చ జరుగుతోంది. కేంద్ర నిబంధనలు కఠినంగా ఉండటం వల్ల ఇతర రాష్ట్రాల ప్రాజెక్టులకు కూడా ఇదే రకమైన నిరాశ ఎదురవుతున్నట్లు మంత్రి సమాధానం ద్వారా స్పష్టమైంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఈ ఎత్తిపోతల పథకం పనులు ఇప్పటికే సుమారు డెబ్బై శాతం మేర పూర్తయ్యాయని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. రిజర్వాయర్లు కెనాల్స్ పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో నీటిని మళ్లించాలంటే పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తి కావాలి. కేంద్రం తాజా తిరస్కరణ నేపథ్యంలో సాంకేతిక నిపుణులతో అత్యవసరంగా సమీక్ష నిర్వహించి తగిన సవరణలతో కొత్త నివేదిక రూపకల్పన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జాతీయ హోదా కల నెరవేరకపోయినా కనీసం ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల పర్యావరణ ఇతర అనుమతులు త్వరగా సాధించేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ తాజా సవాల్‌ను ఎలా ఎదుర్కొంటుందో వేచి చూడాలి.



# పిచ్చి వేషాలేస్తే మెంటల్ ఆసుపత్రికే

**మొదటిపేజీ తరువాయి**

దూరంగా పెట్టారని కీలక సమాచారాన్ని బయటపెట్టారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు మరియు కన్నెపల్లి పంపుహౌస్ వైఫల్యాలపై హరీశ్ రావు చేస్తున్న విమర్శలను సీఎం తీవ్రంగా ఖండించారు. నిపుణుల కమిటీలు ఇచ్చిన అధికారిక నివేదికల మేరకే మేడిగడ్డ గేట్లను ఎత్తివేసినట్లు స్పష్టం చేశారు. ఎన్డీఎస్ఏ చైర్మన్ తో పాటు పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన విచారణ పత్రాలలో కాళేశ్వరం ప్రాజెక్టు డ్యామేజీకి గల అసలు కారణాలు స్పష్టంగా ఉన్నాయని వివరించారు. ఇన్ని వాస్తవాలు కళ్లముందే కనిపిస్తున్నప్పటికీ హరీశ్ రావు పచ్చి అబద్ధాలు మాడుస్తూ అతి తెలివి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి పిచ్చి వేషాలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తే ఎవరూ నమ్మరని, భవిష్యత్తులో జనాలు ఆయన్ను నేరుగా మెంటల్ ఆసుపత్రిలో చేరుస్తారని ఘాటుగా హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన వేల కోట్ల కుంభకోణంపై ఇప్పటికే సీబీఐ విచారణకు అధికారికంగా ఆదేశాలు జారీ చేసినట్లు ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనను అందిస్తామని, తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన ప్రతి ఒక్కరిపైనా కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. అవినీతి పరుల గుండెల్లో గుబులు మొదలైందని, అందుకే వారు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల సంక్షేమం కోసం తాము పనిచేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు మాత్రం అడ్డుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దోషులు త్వరలోనే శిక్షను అనుభవిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటర్ల ప్రత్యేక ప్రక్షాళన ప్రక్రియపై సీఎం రేవంత్ రెడ్డి అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా డెబ్బై శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. అయితే ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ రెండు కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్లను తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఓటు అనేది ప్రతి పౌరుడికి అత్యంత కీలకమైన ఆయుధమని, ఓటు పోతే జీవితమే పోయినట్లు భావించాలని హెచ్చరించారు. ఓటరు జాబితా నుంచి పేరు తొలగిపోతే ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వంటి ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా వర్తించవని స్పష్టం చేశారు. అమాయక ప్రజల ఓట్లను గల్లంతు చేయడానికి జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాల్లోని బూత్ లెవెల్ ఏజెంట్లు అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ నియోజకవర్గాల్లోనే ఉండి ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఎవరి ఓటైనా తొలగింపునకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు.



# కదం తొక్కిన ఉస్మానియా..!

**మొదటిపేజీ తరువాయి**

సృష్టిస్తున్న నీట్ పరీక్షల లీకేజీ కుంభకోణానికి, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన అరాచక ఘటనకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని విద్యార్థి నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు. కోట్ల మంది యువతీ యువకుల జీవితాలతో ముడిపడి ఉన్న ప్రతిష్టాత్మక పరీక్షలలో అవకతవకలు జరగడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని మండి పడ్డారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ వైఫల్యాలపై స్పందించి దేశ ప్రజలకు, విద్యార్థులకు బహిరంగంగా సమాధానం చెప్పాలని నిలదీశారు. నిరుద్యోగాన్ని పెంచుతూ, విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. బాధ్యులైన అధికారులపై, మంత్రాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే రోజుల్లో ఈ నిరసనలు మరింత ఉధృతం అవుతాయని, దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని ప్రభుత్వానికి స్పష్టమైన సంకేతాలు పంపారు. ఈ మహా ధర్నా సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే ప్రతి గొంతును లాఠీచార్జీలతో, బాష్పవాయువులతో, నిర్బంధాలతో అణచివేయాలని చూస్తే అది ప్రజాస్వామ్యం అనిపించుకోదని తీవ్రంగా విమర్శించారు. ఇది కేవలం ఒక రోజు జరిగే నిరసన కార్యక్రమం మాత్రమే కాదని, ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు రగులుతున్న విద్యార్థుల ఆగ్రహ జ్వాల అని స్పష్టం చేశారు. పాలకుల నిర్లక్ష్యం, అహంకారం, ప్రజల గొంతు నొక్కే ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిపై భావి భారత భవిష్యత్తు చేస్తున్న సింహగర్జన అని అభివర్ణించారు. దేశంలో నియంతృత్వ పోకడలు పెరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉద్బోధించారు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను హరించాలని చూస్తున్న శక్తులకు విద్యార్థి లోకం గట్టిగా బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. అన్యాయాన్ని ఎదిరించే తత్త్వం ఉస్మానియా గడ్డపై ఎప్పటికీ సజీవంగా ఉంటుందని మరోసారి నిరూపించారు. బాధిత విద్యార్థులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు మా పోరాటం ఏమాత్రం ఆగదని విద్యార్థి నాయకులు తేల్చిచెప్పారు. దాడులకు పాల్పడిన పోలీసులపై, వారి వెనుక ఉన్న ఉన్నతాధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారికి తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా బాధ్యులపై కఠిన శిక్షలు పడేలా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల బెదిరింపులకు, తప్పుడు కేసులకు విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడరని, హక్కుల సాధన కోసం చివరి వరకు పోరాడుతామని పునరుద్ఘాటించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకిక విలువలను కాపాడుకోవడానికి యువత అంతా ఐక్యంగా ముందుకు రావాల్సిన చారిత్రాత్మక అవసరం ప్రస్తుతం ఏర్పడిందని పిలుపునిచ్చారు.




ఈ పోరాటం కేవలం విద్యార్థుల సమస్యలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తును కాపాడే గొప్ప యజ్ఞమని పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చారిత్రాత్మకంగా ప్రతి ఉద్యమానికి ఊపిరి పోసిందని, అలాగే ఈ నూతన పోరాటానికి కూడా ప్రధాన కేంద్రంగా మారుతుందని నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతి ఉద్యమం విజయవంతం అయినట్టే, ఈ విద్యార్థి ఉద్యమం కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి, ప్రశ్నించే హక్కును నిలబెట్టుకోవడానికి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. క్యాంపస్‌లోని ప్రతి విద్యార్థి గుండెల్లోనూ పాలకుల మోసాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు భావన రగులుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన అహంకార ధోరణిని విడనాడి, విద్యార్థుల డిమాండ్లను తక్షణమే అంగీకరించాలని సూచించారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉన్న యువత రాబోయే రోజుల్లో పార్లమెంటును ముట్టడించే స్థాయికి ఉద్యారాన్ని తీసుకువెళ్తారని తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు అందరూ కలిసికట్టుగా జై భీమ్, జై రాజ్యాంగం, జై ఉస్మానియా అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ నినాదాలతో ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణమంతా మార్మోగింది. దేశ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, ముఖ్యంగా యువత ఈ విషయంలో ముందుండాలని పిలుపునిచ్చారు. అణచివేతలకు తల వంచకుండా ఐక్యమత్యంతో ముందుకు సాగడమే ఈ పోరాటానికి అసలైన విజయమని పేర్కొన్నారు. విద్యార్థుల ఈ ఐక్యత చూసి ప్రభుత్వాలు బెంబేలెత్తుతున్నాయని, అందుకే అణచివేత చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఏ శక్తి కూడా విద్యార్థుల పోరాట పటిమను ఆపలేదని మరోసారి నిరూపించారు. ఈ మహా నిరసన కార్యక్రమం విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థి లోకంలో కొత్త ఉత్సాహం, పోరాట స్ఫూర్తి నిండిపోయాయని చెప్పవచ్చు. ఈ ఉస్మానియా నిరసన ప్రదర్శన దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులలో పెద్దఎత్తున చైతన్యాన్ని తీసుకువచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఢిల్లీ ఘటనపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడింది.

## బాటసింగారం పాఠశాలకు కార్పొరేట్ చేయూత

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**



కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా రియల్‌పేజ్ కంపెనీ దత్తత తీసుకున్న బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సహకారంతో అమలు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పలు మౌలిక వసతులను కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవనానికి లోపల, బయట రంగులు వేయడంతో పాటు బాలుర మూత్రశాలలను మరమ్మతు చేసి, రెండు కొత్త మరుగుదొడ్లను నిర్మించారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు చేతులు కడుక్కునే నల్లాలకు రక్షణ గ్రిల్స్ అమర్చారు. తలుపులు, కిటికీలను మరమ్మతు చేయడంతో పాటు సైన్స్ ప్రయోగశాలకు అవసరమైన పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. రియల్‌పేజ్ కంపెనీతో పాటు ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభివృద్ధి పనులతో విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం అందుబాటులోకి వచ్చిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రియల్‌పేజ్ కంపెనీ ప్రతినిధులు ఉస్మాన్, రాజ్‌కిరణ్, మురళి పాల్గొన్నారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ తరఫున చంద్రకాంత్, అదితి, అమర్‌నాథ్, అస్మా హాజరయ్యారు. అలాగే గ్రామ సర్పంచ్ ఎర్రవల్లి గౌరీ శంకరాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యురాలు జ్యోతి, ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్, ఉపాధ్యాయులు వెంకటస్వామి, టీ. ఉషారాణి, జి. లావణ్య, కే. సునీత, కే. వెంకటమ్మ, కార్యాలయ సిబ్బంది సంతోష్ రెడ్డి, అమీద్, బాల నరసమ్మ, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కోతలు..సాగు కష్టాలు!

**మొదటిపేజీ తరువాయి**

ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్ హామీ కేవలం మాటలకే పరిమితమైందా అంటూ ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగం తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తోంది. సకాలంలో విద్యుత్ అందక పోవడంతో కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి నార్లు ఎండిపోతున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలలో రైతులు రోడ్డెక్కుతున్నారు. ప్రభుత్వ తీరుపై రైతులు బహిరంగంగానే తమ నిరసనలను వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పందన లేకపోవడంతో రైతన్నల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఇటీవల సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ప్రాంతంలోనూ అలాగే నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోనూ రైతులు విద్యుత్ కోతలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కాల్వల ఆయకట్టు లేని మెట్ట ప్రాంతాల్లో బోరుబావులే వ్యవసాయానికి ఏకైక ప్రధాన ఆధారంగా ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావానికి తోడుగా విద్యుత్ సరఫరాలో విపరీతమైన అంతరాయాలు ఏర్పడటంతో బోరుబావుల ద్వారా వచ్చే నీటి లభ్యత భారీగా పడిపోతోంది. రోజుకు కనీసం ఐదు నుంచి ఎనిమిది సార్లు విద్యుత్ ట్రిప్పింగ్ కావడం అలాగే లో వోల్టేజ్ సమస్యలు తీవ్రంగా తలెత్తడంతో నాట్లు వేయడం ఆలస్యమవుతోంది. దీంతో రైతులు తీవ్రమైన ఆర్థిక నష్టాల బారిన పడుతున్నారు. పెట్టుబడి పెట్టిన డబ్బులు బూడిదలో పన్నీరు అయినట్లు మారుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ సరఫరాలో నెలకొన్న తీవ్రమైన సమస్యలకు తిప్పర్తి మండలం ఇండ్లూర్ గ్రామానికి చెందిన రైతులు బుధవారం నాడు చేపట్టిన ఆందోళన అద్దం పడుతోంది. రైతులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా తిప్పర్తి నకిరేకల్ ప్రధాన రహదారిపై ట్రాక్టర్లతో పాటు ఇతర వాహనాలను అడ్డంగా నిలిపి పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంతో కష్టపడి పెంచుకున్న వరి నార్లు నీళ్లు లేక కళ్లముందే ఎండిపోతున్నాయి అంటూ వాపోయారు. నాట్లు వేసే కీలక సమయంలో కరెంట్ సక్రమంగా లేకపోతే పంటలు ఎలా పండుతాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్దామని వెళ్తే ఆఫీసుల్లో అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. బాధ్యులైన వారు వెంటనే స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లో వోల్టేజ్ సమస్య కారణంగా వేలాది రూపాయల విలువైన మోటార్లు అలాగే స్టార్టర్లు తరచూ కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటి మరమ్మతుల కోసం ప్రతిసారీ అయిదు వేల రూపాయల నుంచి ఎనిమిది వేల రూపాయల వరకు అదనపు భారం భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. విద్యుత్ సరఫరా నాణ్యత పూర్తిగా క్షీణించడంతో ఓవర్ లోడ్‌కు గురై కాలిపోతున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖ అధికారులు వారాల తరబడి మార్చడం లేదని ఆరోపిస్తున్నారు. పగటి వేళల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో అర్ధరాత్రి సమయంలో పాములు అలాగే తేళ్ల భయాన్ని సైతం లెక్కచేయకుండా పొలాలకు వెళ్ళి మోటార్లు నడపాల్సిన దుస్థితి నెలకొంది. కరెంటు కోసం పడుతున్న ఈ పాట్లు వర్ణనాతీతంగా మారాయి. ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇరవై నాలుగు గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని గొప్పలు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఇండ్లూర్ గ్రామంలో రైతులు చేపట్టిన రాస్తారోకో ఇందుకు తిరుగులేని నిదర్శనమని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం అలాగే ప్రజాప్రతినిధులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలను పూర్తిగా నిలిపివేయాలని కోరుతున్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను కేవలం ఇరవై నాలుగు గంటల్లోనే మార్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే లైన్‌మన్లు మరియు ఏఈలు క్షేత్రస్థాయిలో రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. అప్పుడే అన్నదాతలకు సాగు పనులలో కొంతమేర ఊరట లభిస్తుందని గట్టిగా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు నాలుగున్నర లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అలాగే ఆరున్నర నుంచి ఏడున్నర లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి తో పాటు వేరుశనగ అలాగే బత్తాయి వంటి ప్రధాన పంటలు సాగవుతున్నాయి. జూన్ అలాగే జులై నెలల్లో వరి నాట్లు అన్నీ పూర్తి కావాల్సి ఉండగా వానలు పూర్తిగా లేకపోవడంతో పాటు కరెంట్ సరఫరా కూడా సరిగా లేక పంటలు ఎండిపోతున్నాయి. ఈ దుస్థితి నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు. అన్నదాతల కష్టాలను గుర్తించి అధికార వర్గాలు తగిన చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నారు. లేదంటే రాబోయే రోజుల్లో రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నారు.



**సికింద్రాబాద్, విశాల భారతి :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తెలుగు చలనచిత్ర పరిశ్రమ హీరో నందమూరి తారక రామారావు కుమారుడు నందమూరి రామకృష్ణని జూబిలీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెదేపా సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంఛార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్.



# రంగనాథ్‌కు గండం!

**మొదటిపేజీ తరువాయి**



ఒకటి అలాగే రెండుకు చెందిన వివాదాస్పద భూముల వ్యవహారంలో ఉన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాలతో పాటు పరిపాలనా రంగంలో సైతం తీవ్ర సంచలనం సృష్టించాయి. కోర్టు ముందే స్పష్టమైన స్టే ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ హైడ్రా అధికారులు ప్రైవేట్ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించారనే ఆరోపణలపై బాధితులు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను విచారించిన సందర్భంగా ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. చట్టబద్ధమైన పరిధులను దాటి ఏజెన్సీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలకు ఈ ఘటన బలం చేకూర్చింది. న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను సైతం లెక్కచేయకుండా యంత్రాంగం ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడంపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ చట్టాన్ని ఉల్లంఘించే ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని గట్టిగా హెచ్చరించారు. లోతుకుంట ప్రాంతంలోని భూ వివాదానికి సంబంధించి గతంలోనే బాధితులకు అనుకూలంగా న్యాయస్థానం రక్షణ కల్పిస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ ఆదేశాలు స్పష్టంగా అమల్లో ఉన్న సమయంలోనే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తన సిబ్బందితో కలిసి ఆ భూముల జోలికి వెళ్లారని, నిబంధనలను పూర్తిగా విస్మరించారని పిటిషనర్లు తమ వాదనలో కోర్టుకు నివేదించారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం న్యాయస్థానం ఆదేశాలను పదేపదే ఉల్లంఘించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్టానికి ఎవరూ అతీతులు కారనే విషయాన్ని అధికారులు విస్మరిస్తున్నారని ధర్మాసనం తప్పుబట్టింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సింది పోయి ప్రైవేట్ భూ వివాదాల్లో తలదూర్చడం ఎంతవరకు సమంజసమని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఈ వ్యవహార సరళిపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విచారణ సందర్భంగా హైకోర్టు చేసిన కొన్ని వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కోర్టు ఉత్తర్వులను గౌరవించకుండా వ్యవహరిస్తే సైన్యం రక్షణ తీసుకోవాల్సి వస్తుందని, ఆర్మీ భూముల పరిధిలోకి లేదా తమ అధికార పరిధి దాటి ఎవరొచ్చినా వారిని నిర్బంధించాలని స్పష్టం చేశారు. ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే హైడ్రా అధికారులతో పాటు సంబంధిత సిబ్బందిని అదుపులోకి తీసుకుని సంకెళ్లు వేయాలంటూ ఆర్మీ ఉన్నతాధికారులకు, పోలీసులకు ఆదేశాలు జారీ చేయవచ్చని వ్యాఖ్యానించడం కలకలం రేపింది. ఈ రకమైన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ మరియు కార్యానిర్వాహక వ్యవస్థ మధ్య ఉన్న ఘర్షణ వాతావరణాన్ని స్పష్టం చేస్తున్నాయి. రక్షణ భూములు అలాగే మిలిటరీ స్థలాల జోలికి ఎవరైనా అనుమతి లేకుండా వెళితే భద్రతా బలగాలు తమ నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తాయని, దానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదని కోర్టు పరోక్షంగా హెచ్చరించినట్లయింది. ప్రజా ఆస్తుల రక్షణ పేరుతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన హైడ్రా వ్యవస్థ తన పరిధిని దాటి వ్యవహరిస్తోందన్న విమర్శలు ప్రారంభం నుంచీ వినిపిస్తున్నాయి. తాజాగా లోతుకుంట భూముల వివాదంలో హైకోర్టు చేసిన ఘాటు వ్యాఖ్యలు హైడ్రా వర్సెస్ న్యాయవ్యవస్థ అనే కొత్త చర్చకు తెరలేపాయి. ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ నాయకత్వంలో నడుస్తున్న ఈ ఏజెన్సీ తన అధికార పరిమితులను పూర్తిగా విస్మరిస్తోందని బాధితులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మరోవైపు తాము ఎలాంటి కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించలేదని, కేవలం చట్టం ప్రకారం ప్రభుత్వ భూములను మాత్రమే రక్షిస్తున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేస్తున్నారు. అయితే చట్టబద్ధమైన ప్రక్రియలను పాటించకుండా ముందుకెళ్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉన్నత న్యాయస్థానం నుంచి స్పష్టమైన హెచ్చరికలు వెలువడటంతో రానున్న రోజుల్లో ఈ వివాదం మరింత ముదిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కోర్టు ధిక్కరణ కింద దాఖలైన ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ మరింత కీలకంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించినట్లు రుజువైతే కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులపై కోర్టు ధిక్కరణ కింద కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రజాధనంతో నడిచే ప్రభుత్వ సంస్థలు పౌరుల హక్కులను కాపాడటంలో విఫలమైతే న్యాయస్థానాలు తీవ్రంగా పరిగణిస్తాయనే దానికి ఈ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై న్యాయం కోరుతూ హైకోర్టును ఆశ్రయించడం వలన ఈ సంచలన తీర్పులకు అవకాశం లభించింది. ఏజెన్సీ దూకుడును అడ్డుకునేందుకు న్యాయస్థానం వేసిన ఈ అడుగు పరిపాలనా వర్గాల్లో పెద్దఎత్తున కలవరం సృష్టిస్తోంది. భవిష్యత్తులో హైడ్రా చేపట్టే ప్రతి చర్యపైనా కోర్టుల నిఘా మరింత కఠినతరం కానుందనే సంకేతాలు వెలువడుతున్నాయి. హైడ్రా చేపట్టిన అనేక కూల్చివేతలు అలాగే భూముల పరిరక్షణ చర్యలపై ఇప్పటికే వివిధ వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు చెరువుల కబ్జాలను తొలగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతోందని కొందరు సమర్థిస్తుంటే, మరోవైపు సరైన నోటీసులు ఇవ్వకుండా, చట్టపరమైన పత్రాలను పరిశీలించకుండా హడావుడిగా వ్యవహరిస్తున్నారని మరికొందరు విమర్శిస్తున్నారు. లోతుకుంట వివాదం ఇందుకు ప్రధాన ఉదాహరణగా నిలుస్తోంది. ప్రైవేట్ హక్కులు ఉన్న భూముల్లో కూడా ఏజెన్సీ జోక్యం చేసుకోవడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన ఘాటు హెచ్చరికలు కేవలం ఒక భూ వివాదానికి మాత్రమే పరిమితం కాకుండా హైడ్రా మొత్తానికి ఒక గట్టి గుణపాఠంగా మారుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హన్మకొండ వేదికగా సంతాన సంరక్షణపై కీలక చర్చ!

**హ**న్మకొండలో ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో 'జననీ డైలాగ్స్' తొలి జాతీయ సదస్సును అత్యంత ఘనంగా నిర్వహించారు. భారతదేశంలో కుటుంబ నిర్మాణం, సంతానోత్పత్తి ఆరోగ్యం మరియు మారుతున్న జీవనశైలిపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ ప్రధాన చర్చను హన్మకొండతో పాటు వివిధ నగరాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఒకే వేదిక అందుబాటులోకి వచ్చింది. ప్రజారోగ్య నిపుణులు, ప్రభుత్వ ప్రతినిధులు, మనస్తత్వవేత్తలు, హెచ్ఆర్ నాయకులు, శిశు సంక్షేమ శాఖ అధికారులు మరియు పునరుత్పత్తి వైద్య నిపుణులు ఈ వేదికపై ఒకచోట చేరి విస్తృతంగా చర్చించారు. కుటుంబాలకు అనుకూలమైన భారతదేశాన్ని నిర్మించడానికి అన్ని రంగాల వారు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఈ సదస్సులో కూలంకషంగా ఆలోచనలు పంచుకున్నారు.

**విశాలభారతి హన్మకొండ:**

భారతదేశంలో కుటుంబాలను నిర్మించుకునే విధానంలో నిశ్శబ్దంగా కానీ గణనీయమైన మార్పులు వస్తున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దేశం యొక్క మొత్తం సంతానోత్పత్తి రేటు ఇప్పటికే జనాభా భర్తీ స్థాయి కంటే తక్కువగా పడిపోవడం గమనార్హం. ఈ జనాభా మార్పునకు ఆలస్యంగా జరుగుతున్న వివాహాల కంటే, విద్య, వృత్తి, ఆర్థిక భద్రత మరియు వ్యక్తిగత ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ దంపతులు ఉద్దేశపూర్వకంగా సంతానోత్పత్తిని వాయిదా వేయడమే ప్రధాన కారణమని గుర్తించారు. ఆధునిక జీవనశైలి వేగంగా మారుతున్నప్పటికీ, సంతానోత్పత్తి సామర్థ్యం మాత్రం తన సహజ క్రమంలోనే సాగుతుంది. ఈ కారణంగా ముందస్తు అవగాహన, నివారణ ఆరోగ్య సంరక్షణ మరింత ముఖ్యమైనవిగా మారుతున్నాయి.




సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా చాలా వరకు సంతానలేమి సమస్యలను నివారించవచ్చని నిపుణులు స్పష్టం చేయడం విశేషం. మారుతున్న జీవిత ఆకాంక్షలకు, మారకుండా ఉన్న జీవసంబంధ వాస్తవాలకు మధ్య పెరుగుతున్న అంతరాన్ని 'పేరెంట్‌హుడ్ పారడాక్స్' లేదా తల్లిదండ్రులు కావాలనే ఆకాంక్ష-వాస్తవాల మధ్య వైరుధ్యంగా అభివర్ణించారు. ఎవరి వ్యక్తిగత నిర్ణయాలను ప్రభావితం చేయడం తమ లక్ష్యం కాదని, కానీ సకాలంలో అవగాహన కల్పించడం ద్వారా సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడమే తమ ధ్యేయమని ప్యానెలిస్టులు తెలిపారు. తల్లిదండ్రులు కావడానికి అయ్యే ఆర్థిక వ్యయం, పిల్లల పెంపకం, ఆర్థిక ప్రణాళికలను వ్యక్తిగత భారంగా కాకుండా కుటుంబ నిర్మాణానికి అవసరమైన తోడ్పాటుగా భావించాలని వక్తలు సూచించారు. పిల్లల పెంపకంలో తండ్రుల పాత్రను బలోపేతం చేయడం, కార్యాలయాలు మరియు విద్యాసంస్థలు కుటుంబాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ వేదిక ద్వారా బలంగా చెప్పారు. సభను ఉద్దేశించి ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి. రావు మాట్లాడుతూ కుటుంబ నిర్మాణం కోసం ప్రణాళిక చేసుకోవడం క్రమంగా కష్టతరం అవుతోందని తెలిపారు. దీనికి ప్రజల్లో ఆసక్తి తగ్గడం కారణం కాదని, జీవసంబంధ కాలపరిమితి, ఆర్థిక వ్యయం, ఉద్యోగ ఒత్తిళ్లు పరస్పరం భిన్న దిశల్లో ప్రభావం చూపడమేనని వివరించారు. కుటుంబాలు ఒంటరిగా ముందుకు సాగకుండా ప్రభుత్వం, ఆరోగ్య నిపుణులు, ఉద్యోగదాతలు, సమాజంలోని వివిధ వర్గాలను ఒకే వేదికపైకి 'జనని డైలాగ్స్' తీసుకువచ్చిందని ఆమె అన్నారు. పునరుత్పత్తి వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి అంకితమైన 'ఒయాసిస్ అకాడమీ'ని ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ అకాడమీ పరిశోధనలు, క్లినికల్ అధ్యయనాలు, నాలెడ్జ్ ట్రాన్స్ఫర్ మరియు నిపుణులకు శిక్షణ ఇవ్వడం వంటి మూడు కీలక రంగాలలో తన సేవలను విస్తృతంగా అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ అకాడమీ శాస్త్రీయ సహకారాన్ని పెంపొందించడానికి మరియు జాతీయ, అంతర్జాతీయ విద్యా వేదికలలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి వేదికగా పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఇటీవలి ESHRE 2026లో 29 శాస్త్రీయ పత్రాలను సమర్పించడం ద్వారా ప్రపంచ పునరుత్పత్తి వైద్య రంగానికి సంస్థ అందిస్తున్న సహకారాన్ని చాటుకున్నారు. ఇప్పటివరకు 250 మందికి పైగా క్లినిషియన్లకు, 200 మందికి పైగా ఎంబ్రియాలజిస్టులకు ఈ అకాడమీ శిక్షణనిచ్చింది. ముఖ్యంగా టైర్2 మరియు టైర్3 ప్రాంతాలలో ఈ ప్రత్యేక శిక్షణను మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజినల్ మెడికల్ హెడ్ డాక్టర్ జలగం కావ్య రావు మాట్లాడుతూ, ముందస్తు అవగాహన పెంపొందించుకోవడం ఎంత ముఖ్యమో ఈ సదస్సు స్పష్టం చేస్తోందని, నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. జనని డైలాగ్స్ అనేది కేవలం ఒక ప్రజా ప్రయోజన వేదిక మాత్రమేనని, ఐవీఎఫ్ లేదా సంతాన సాఫల్య చికిత్సలకు సంబంధించిన ప్రచార వేదిక కాదని ఒయాసిస్ ఫెర్టిలిటీ స్పష్టం చేసింది. ఇది ఏ వైద్య విధానాన్ని బలవంతంగా ప్రోత్సహించదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పిల్లలను కనాలని సూచించదని తేల్చిచెప్పింది. బదులుగా దంపతులకు మరియు కుటుంబాలకు మధ్య అడ్డుగా నిలుస్తున్న ఆర్థిక, వైద్య, కార్యాలయ మరియు సామాజిక అంశాలపై ఇది దృష్టి పెడుతుందని పేర్కొంది. ప్రభుత్వం, యజమానులు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు ఈ సమస్యల పరిష్కారానికి ఒక్కొక్కరుగా ఏమి చేయగలరనే అంశాలపై సమాజంలో చర్చను లేవనెత్తడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జనని డిక్లరేషన్' తో ముగిసింది. జీవితకాల పునరుత్పత్తి ఆరోగ్యం, సమాచారంతో కూడిన ఎంపికలు, ఉమ్మడి బాధ్యత, తల్లిదండ్రులుగా మారే ప్రతి మార్గానికి గౌరవం, వృత్తి మరియు కుటుంబ ఆకాంక్షలను సమతుల్యం చేసుకోవడం, కుటుంబ స్నేహపూర్వక భారతదేశాన్ని నిర్మించడానికి సామూహిక నిబద్ధత అనే ఆరు మార్గదర్శక సూత్రాలను ఇందులో పొందుపరిచారు. భారత దేశవ్యాప్తంగా పునరుత్పత్తి ఆరోగ్యం మరియు కుటుంబ నిర్మాణంలో అవగాహన, సేవల లభ్యత మరియు స్థోమతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ డిక్లరేషన్ రూపొందించారు. విధానపరమైన భాగస్వామ్యం, పరిశోధన మరియు బహుళ రంగాల సహకారం ద్వారా జననీ డైలాగ్స్ ను ఒక వార్షిక ప్రజా ప్రయోజన కార్యక్రమంగా భవిష్యత్తులోనూ విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి ఒయాసిస్ ఫెర్టిలిటీ తమ పూర్తి నిబద్ధతను ఈ సందర్భంగా మరోసారి పునరుద్ఘాటించింది.

# ప్రభుత్వ భూమిని మింగేస్తున్న భూ మాఫియా..!

- ఆస్పత్రి ఎదురుగా అక్రమ వెంచర్ కలకలం
- కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు
- అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారా..?
- సమగ్ర విచారణ చేసి భూమిని స్వాధీనం చేసుకోవాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మిరియాల శ్రీనివాస్








**కురవి విశాల భారతి:**

కురవి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి అక్రమ వెంచర్ రూపంలో కబ్జాకు గురవుతోందన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన బంజరు భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించి, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే వెంచర్‌గా అభివృద్ధి చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మిరియాల శ్రీనివాస్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్వో, గ్రామపంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మిరియాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు తమ బాధ్యతలను విస్మరించడం వల్లే ఈ అక్రమ దందా బహిరంగంగా సాగుతోందని విమర్శించారు. కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి కబ్జాకు గురవుతున్నా అధికారులు మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కొందరు భూ మాఫియా సభ్యులు ప్రభుత్వ భూమిని చదును చేసి, రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసి, చట్టబద్ధమైన లేఅవుట్‌ల మాదిరిగా చూపిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రభుత్వ భూమిని సమీపంలోని ప్రైవేట్ భూములతో కలిపి చూపిస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారని తెలిపారు. ఆకర్షణీయమైన ప్రకటనలు, తక్కువ ధరల పేరుతో ప్రజలను ఆకర్షించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, భవిష్యత్తులో ఆ ప్లాట్లకు చట్టబద్ధ హక్కులు లేక ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**సర్వే నంబర్ 547లో భారీ అక్రమాలు..?**

ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సర్వే నంబర్ 547లోని భూమిపై వెంటనే అధికారిక సర్వే నిర్వహించాలని మిరియాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భూమి అసలు హద్దులను చెరిపివేసి, ఆనవాళ్లు లేకుండా చదును చేసి వెంచర్ ఏర్పాటు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములకు రక్షణ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, హద్దులు నిర్ధారించకపోవడం కూడా ఆక్రమణలకు ప్రధాన కారణమని విమర్శించారు.

**అధికారుల మౌనం వెనుక ఎవరి అండ..?**

ప్రభుత్వ భూమిలో బహిరంగంగా రోడ్లు వేయడం, నాలాలు నిర్మించడం, ప్లాట్ల మార్కింగ్ చేయడం వంటి పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అక్రమ వెంచర్లకు ఇప్పటి వరకు నోటీసులు జారీ చేయకపోవడం, పనులు ఆపేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఎవరి అండ ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని విమర్శించారు.

**భూ మాఫియాపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**

అక్రమ వెంచర్‌పై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. అలాగే భూమికి శాశ్వత సరిహద్దులు నిర్ణయించి రక్షణ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరింది. అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దని, ప్లాటు కొనుగోలు చేసే ముందు రెవెన్యూ రికార్డులు, లేఅవుట్ అనుమతులు, సంబంధిత పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తులు పూర్తిగా భూ మాఫియా చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఎమ్మార్పీఎస్ హెచ్చరిస్తూ, ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పారదర్శక విచారణ నిర్వహించాలని డిమాండ్ చేసింది.

# విద్యార్థుల ఉసురు పోసుకోవద్దు.. కేంద్ర మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

**నీట్ అక్రమాలపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్**




**కోదాడ, విశాలభారతి:** నీట్ పరీక్షల లీకేజీ, నిర్వహణలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కోదాడ అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ప్రతినిధులు కోరారు. బీఆర్ఎస్వీ కోదాడ పట్టణ అధ్యక్షుడు బొర్రా వంశీ నాని ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివిన చదువుకు విలువ లేకుండా చేస్తూ, వారి భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన మండిపడ్డారు. విద్యార్థుల ఉసురు పోసుకుంటే ఎంతటి ప్రభుత్వాలైనా కుప్పకూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా పరీక్షల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, నిరసిస్తున్న విద్యార్థులపై మోపిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ముత్యాలు, సీపీఎం రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోటగిరి వెంకటనారాయణ, ఎంఎల్ పార్టీ నాయకుడు ఉదయగిరి, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ మునీర్, వికలాంగుల సంఘం అధ్యక్షుడు గిద్దె రాజేష్, పీడీఎస్‌యూ నాయకుడు రవి, బీఆర్ఎస్ నాయకులు బత్తుల ఉపేందర్, సంపేట ఉపేందర్, ఖరీమ్, మీరా, ఆసిఫ్, మణికంఠ, సతీష్, నవీన్, చలిగంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# వాసం కృష్ణయ్య మరణం పార్టీకి తీరని లోటని



**వాజేడు జులై 23 విశాల భారతి :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించిన వాసం కృష్ణయ్య మరణం పట్ల ఈరోజు వారి కుటుంబాన్ని కలిసి పార్టీ తరపున వారికి సంతాపాన్ని తెలియజేశారు, కుటుంబానికి మనోధైర్యం నింపుతూ పార్టీ ఎప్పుడు మీకు అండగా ఉంటుందని మీ ప్రతి కష్టంలోనూ పార్టీ మీకు అండగా ఉంటుందని వారికి ధైర్యాన్ని చెప్పారు అనంతరం వారికి 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పెనుమల రామకృష్ణారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు మడిగ తిరుపతి యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గొంది రమణ రావు, మాజీ కోప్సన్ సభ్యులు షేక్ నిజాముద్దీన్ ,ఎస్సీ సెల్ నాయకులు చెన్నం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# కురవిలో భిక్షాటన చేసుకుంటున్న వ్యక్తి మృతి

**కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**కురవి విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. కురవి పోలీసుల వివరాల ప్రకారం, ఎన్‌టీఆర్ జిల్లా చిలకలూరిపేటకు చెందిన కుంచపు పోతరాజు (50) అనే వ్యక్తి గత పదేళ్లుగా కుటుంబ కలహాల కారణంగా స్వగ్రామాన్ని విడిచి కురవికి వచ్చి శ్రీ వీరభద్రస్వామి ఆలయం, నాగులమ్మ ఆలయం పరిసరాల్లో నివసిస్తూ భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. గురువారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో అతడు అస్వస్థతకు గురై పడిఉండగా స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు, వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వైద్యులు పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కురవి పోలీసులు సంఘటనా స్థలంలో పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమార్తె బత్తుల అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురవి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ కొనసాగుతోందని కురవి స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి. సతీష్ తెలిపారు.

# హాస్టల్ కథలు ఆవిష్కరణ సభకు సర్వం సిద్ధం

- 26న ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఘనంగా ఆవిష్కరణ
- భారీగా తరలిరావాలని కొమిరే సాకీ పిలుపు





**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** ప్రముఖ రచయిత, రిటైర్డ్ ఏటీడబ్ల్యూ అధికారి కోమాకుల సీతారాములు రచించిన "హాస్టల్ కథలు" కథా సంకలన ఆవిష్కరణ సభ ఈ నెల 26వ తేదీన ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యుడు కొమిరే సాకీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సభకు కాళోజీ పురస్కార గ్రహీత, ప్రముఖ కవి సీతారాం అధ్యక్షత వహించనున్నారని, మాజీ ఐఏఎస్ అధికారి చేతుల మీదుగా "హాస్టల్ కథలు" పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని రచయిత కోమాకుల సీతారాములు సాహిత్య సేవలను కొనియాడనున్నారని తెలిపారు. అదే వేదికపై కోమాకుల సీతారాములు గారి శిష్యుడు, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియోకు ఘన సన్మానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సన్మానం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని చెప్పారు. ఈ ఆవిష్కరణ సభకు రచయిత శిష్యులు, బంధుమిత్రులు, కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొమిరే సాకీ పిలుపునిచ్చారు. సాహిత్యాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని రచయితను అభినందించాలని ఆయన కోరారు.

# నీట్ అక్రమాలకు వ్యతిరేకంగా ఓయూలో నిరసన



**ముషీరాబాద్,విశాల భారతి:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ (NEET) అక్రమాలకు వ్యతిరేకంగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఆందోళనకారులపై పోలీసులు జరిపిన లాఠీచార్జీ, దాడులను ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండించింది. దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ అధ్యక్షులు నరసింహరావు మాట్లాడుతూ విద్యార్థులు యువతపై పోలీసుల దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు అనేక పేపర్లు లీక్ అయ్యాయని ఆరోపించారు. లీకేజ్ లకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన దాడికి నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా

- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సవాల్
- గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటన

**విశాల భారతి గోదావరిఖని**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం 10 వేల ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని, అలాంటప్పుడు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో 70 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి నియామకాలు పూర్తి చేసినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధమని ఆయన ప్రకటించారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగాల అంశంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్న లెక్కలకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వ్యాఖ్యలకు ఎలాంటి పొంతన లేదన్నారు. రాష్ట్ర పరిస్థితులపై అవగాహన లేకుండానే ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే దాదాపు 60 వేల ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు వచ్చినా వాటిని కాంగ్రెస్ సాధనగా చెప్పుకోవడం సరైంది కాదన్నారు. ఉద్యోగాల నియామకాలపై ఎప్పుడైనా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బహిరంగ చర్చకు తాము సిద్ధమని, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కూడా సిద్ధంగా రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో లక్షా 60 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న చందర్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేసే నైతిక హక్కు రాజ్ ఠాకూర్‌కు లేదన్నారు. కేటీఆర్‌ను రాజీనామా చేయాలని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో సాగునీటి పరిస్థితిపై కూడా చందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రెండున్నరేళ్ల క్రితం గోదావరి నది సముద్రాన్ని తలపించేలా ఉండేదని, ప్రస్తుతం ఎండిపోయిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కన్నేపల్లి పంప్ హౌస్ ద్వారా నీటి సరఫరా ప్రారంభించేలా ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు సూచిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, రాజకీయ ప్రచారాల కోసం అనవసర వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

# చిలుక మధుసూదన్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు ఘన స్వాగతం

**ఆత్మీయ ఆతిథ్యం స్వీకరించిన ఎమ్మెల్యే – స్థానిక అభివృద్ధి అంశాలపై చర్చ**

**అబ్దుల్లాపూర్‌మెట్,విశాల భారతి :**



జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ గురువారం సాయంత్రం గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించి ఆతిథ్యాన్ని అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ..ప్రజల ప్రేమాభిమానాలే ప్రజాప్రతినిధులకు గొప్ప బలమని అన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని తెలిపారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ఆహ్వానాన్ని మన్నించి స్వగృహానికి విచ్చేసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రాంత అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక అభివృద్ధి, ప్రజా సంక్షేమం, వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై పరస్పరం చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేకు స్మృతిచిహ్నం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

**రోజువారీ శుభ్రత చర్యలు తప్పనిసరి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**విశాలభారతి, మెదక్ :** విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో వసతి గృహాల్లో ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాస్టల్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం చిన్న శంకరంపేట మండల పర్యటనలో భాగంగా షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి ఆహార పదార్థాల నిల్వ విధానం, పరిశుభ్రతను తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ ఆవరణ, డ్రైనేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, విద్యార్థుల గదులు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు పరిశుభ్రత అత్యంత కీలకమని పేర్కొంటూ, మరుగుదొడ్లు, హాస్టల్ గదులు ప్రతిరోజూ శుభ్రం చేయాలని సూచించారు. హాస్టల్ ఆవరణలో మొక్కలను క్రమ పద్ధతిలో పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ నిధులను సమర్థవంతంగా వినియోగించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. హాస్టల్‌లో తగినంత వెలుతురు ఉండేలా అదనంగా ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

# ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఇంటిగ్రేడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించిన

**మండల విద్యాశాఖ అధికారి ఎ సుజాత**



**గూడూరు, విశాల భారతి జులై 23:** గూడూరు మండల కేంద్రంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల యందు మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ఇన్ఫో శిక్షణ కార్యక్రమం మూడు రోజులు 23.07.2026 నుండి 25.07.2026 నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఏ సుజాత స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొనడం జరిగినది ఈ ట్రైనింగ్ కొరకు ప్రతి ప్రాథమిక పాఠశాల నుండి 50 శాతం చొప్పున హాజరు కావడం జరిగింది

# దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్



**విశాల భారతి దేవాపూర్ :** వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్, బెల్లంపల్లి సబ్‌డివిజన్‌లోని దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, స్టేషన్‌లోని వివిధ రకాల కీలక రికార్డులు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదులు,కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని, సీసీటీఎన్ఎస్‌లో నమోదులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. కోర్టులతో సమన్వయంతో పనిచేసి ఎక్కువ కేసుల్లో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రక్షణ, భద్రత కల్పించడం పోలీసుల ప్రాథమిక విధి,బాధ్యత అని పేర్కొన్నారు.సిబ్బంది విధులను నిరంతరం పర్యవేక్షిస్తూ,వారు సమర్థవంతంగా పనిచేసేలా వారి నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై నేరాల నివారణకు కృషి చేయాలని అన్నారు.ఈ తనిఖీలో మందమర్రి సీఐ పి. రమేష్,దేవాపూర్ ఎస్ఐ గంగారం పాల్గొన్నారు.

# వాహనాల పాత సామగ్రికి బహిరంగ వేలం




**విశాల భారతి గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వాహనాలకు సంబంధించిన పాత స్పేర్ పార్ట్స్,టైర్లు, బ్యాటరీలు, ఉపయోగించిన ఇంజిన్ ఆయిల్‌ను ఈ నెల 27వ తేదీన కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి గల వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.మరిన్ని వివరాల కోసం ఎంటీవో మల్లేశంను 8712656616 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# నీట్ లీకేజీపై కాంగ్రెస్ నిరసన



**ఆదిలాబాద్ జిల్లా జూలై 23 విశాల భారతి న్యూస్ :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఉభయ సభల్లో చర్చ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బోథ్ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి గురైన తాపీ మేస్త్రి పరామర్శ

**మునగాల, విశాలభారతి:** నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి బొడ్డుపల్లి మైసయ్యను భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) నాయకులు పరామర్శించారు. ఇటీవల తాడ్వాయిలో పరంజి పైనుంచి కిందపడటంతో మైసయ్య ముక్కుకు తీవ్ర గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న సీఐటీయూ మండల కమిటీ ప్రతినిధులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి, వ్యక్తిగత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిర్మాణ కార్మికులకు పనిస్థలాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రమాదాలకు గురైన వారికి ప్రభుత్వం, వెల్ఫేర్ బోర్డు నుంచి తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులు కూడా భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంట వెంకటేశ్వర్లు, కోల ఆంజనేయులు, ఎస్కే దస్తగిరి, అల్లినాగరాజు, నాగేంద్రబాబు, చిన్న శీను, రమేష్, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు కేబినెట్ మంత్రి హోదా,శాలువాతో ఘన సన్మానం

**కొల్లోజు శ్రీకాంత్ మీడియా రిపోర్టర్**



**చిట్యాల విశాల భారతి:** నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు కేబినెట్ మంత్రి హోదా లభించిన సందర్భంగా, ఆయన నివాసంలో మీడియా రిపోర్టర్ కొల్లోజు శ్రీకాంత్, మైనార్టీ సెల్ నాయకుడు షేక్ నసీర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోలి లింగస్వామి, ఐతరాజు మురళి తదితరులు పాల్గొని వేముల వీరేశంకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేబినెట్ మంత్రి హోదాతో ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తూ, నకిరేకల్ నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# సర్వే సమయంలో అధికారులకు ప్రజలందరూ సహకరించాలి

**టేకుల మంజుల దిలీప్ రెడ్డి సర్పంచ్**



**చౌటుప్పల్ విశాల భారతి:** తెలంగాణలో చేపట్టినటువంటి భూ సర్వే రీ సర్వే అవగాహన సదస్సులో భాగంగా అల్లాపురంలో ఆ గ్రామ టేకుల మంజుల దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో సభను నిర్వహించడం జరిగింది.ఈ గ్రామ సభకు మండల రెవెన్యూ అధికారులు హాజరై పైలెట్ ప్రాజెక్టు కింద అల్లాపురం గ్రామం సెలెక్ట్ అవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మండల తహసిదారు మాట్లాడుతూ..పైలెట్ ప్రాజెక్టు కింద అల్లాపురం గ్రామాన్ని ఎంచుకోవడం జరిగింది.ఈ గ్రామంలో సర్వే నిర్వహించేటప్పుడు ముందుగా గ్రామంలో ఉన్నటువంటి రెవిన్యూ భూములపై ఒక బౌండరీ వేసి ఆ తర్వాత సర్వే చేయడం జరుగుతుంది.ఈ సర్వేకి ప్రతి ఒక రైతు సహకరించవలసిందిగా ఈ సందర్భంగా ఆమె కోరడం జరిగింది. సభ అధ్యక్షత వహించినటువంటి గ్రామ సర్పంచ్ మంజుల రెడ్డి మాట్లాడుతూ..పైలెట్ ప్రాజెక్టు కింద మన గ్రామం సెలెక్ట్ అవ్వడం మంచి పరిణామం అని ఈ సర్వే చేసేటప్పుడు రెవెన్యూ అధికారులకు రైతులందరూ కూడా సహకరించి ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క రైతు సహకరించాలని కోరడం జరిగింది. అనంతరం ఎంపీడీఓ శ్రీలత జలశక్తి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఫీల్డ్ విజిట్ కి వచ్చి గ్రామ ప్రజలతో మాట్లాడుతూ..భూగర్భ జలాలు పెరగాలంటే రైతులు ఊటకుంటలు, పంట కుంటలు, ప్రతిఒక్కరు తమ ఇంటిలోపల ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరడం జరిగింది.అనంతరం ఎంపీడీవో కి సర్పంచ్ మంజుల దిలీప్ రెడ్డి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ మరియు ఆర్ఐ,ఉపసర్పంచ్ బోయిని లింగస్వామి వార్డు సభ్యులు యంజాల లింగస్వామి,భూతం లింగస్వామి,యంజాల శ్రీకాంత్,యంజాల అమృత,సర్వేయర్,ఇరిగేషన్ ఏ ఈ గ్రామ కార్యదర్శి,గ్రామ పెద్దలు రైతులు,పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

**మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



**నడిగూడెం, విశాలభారతి:** నడిగూడెం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను స్వయంగా సందర్శించారు. రైతులకు ప్రతిరోజూ ఎన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా జరుగుతోందనే విషయంపై అక్కడి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగు నీరు, విద్యుత్ అందక రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నష్టం వాటిల్లకుండా తక్షణమే నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోకముందే విద్యుత్ సమస్యలను పరిష్కరించి, అన్నదాతలను ఆదుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజ హితమే లక్ష్యం.. పేద విద్యార్థులకు కాకతీయ సేవా సమితి ఆసరా



**కోదాడ, విశాలభారతి:** సమాజంలో అట్టడుగు వర్గాల వారికి సేవ చేయడమే లక్ష్యంగా కాకతీయ సేవాసమితి పనిచేస్తుందని సంస్థ సభ్యులు తెలిపారు. గురువారం దుర్గాపురం వై జంక్షన్ కాకతీయ కళ్యాణ మండపంలో, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదిమంది పేద విద్యార్థులకు లక్ష రూపాయల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే వీరేపల్లి లక్ష్మీనారాయణరావు సౌజన్యంతో, ఆయన సతీమణి సత్యవతి మూడవ వర్ధంతి సందర్భంగా ఈ ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. కళ్యాణ మండపం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా పేదల కోసమే ఖర్చు చేస్తామని నిర్వాహకులు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పెదనాటి వెంకటేశ్వరరావు, సెక్రటరీ వేమూరి సురేష్, పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి, విద్యుత్ ఎస్‌ఈ శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ కందుల చంద్రశేఖర్, నాయకులు మహబూబ్ జానీ, గన్న చంద్రశేఖర్, ముత్యాలు, ఓరుగంటి ప్రభాకర్, శ్రీనివాస్, భరత రెడ్డి, వీరారెడ్డి, రావెళ్ల సీతారామయ్య, పోటు రంగారావు, బాలకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, గంట సత్యనారాయణ, కనగాల నాగేశ్వరరావు, పైడిమర్రి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ రక్షణ అందరి బాధ్యత: కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి



కోదాడ, జూలై 23 (విశాలాభారతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోదాడ పట్టణంలోని కేటీఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కోదాడ ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు కలిసి ఒకే రోజు 300 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ బాధ్యతగా మొక్కలను నాటడమే కాకుండా, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించడానికి విద్యార్థి దశ నుంచే పచ్చదనంపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా కాపాడుకుంటామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఆదం

**సికింద్రాబాద్, విశాల భారతి :**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్, యూజీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనకు సంఘీభావం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ, సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సీతాఫల్మండి అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాహుల్ గాంధీ పై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ మాట్లాడుతు ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని అన్నారు. పేపర్ లీకేజీలకు కారణ




మైన అసలు సూత్రధారులను గుర్తించి ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. వైద్య విద్యలో ప్రవేశం కోసం విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదువుతున్నారని, తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ ఇప్పిస్తున్నారని తెలిపారు. రాత్రింబవళ్లు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల జీవితాలతో కొందరు అక్రమాలకు పాల్పడుతూ చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలు పదేపదే రద్దు కావడంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, తల్లిదండ్రులు ఆర్థికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రస్తావిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు బలప్రయోగం చేసి అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను అమలు చేయాలని ఆదం సంతోష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాజేందర్ యాదవ్, శిల్పాచారి, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఘటనలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తూర్పు తండా గ్రామపంచాయతీలో సీసీ కెమెరాల వ్యవహారం కలకలం

- **సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తర్వాత వాటి బిల్లులు ఎందుకు చెల్లించలేదు?**
- **గ్రామ భద్రతను పర్యవేక్షించే వ్యవస్థ ఎందుకు నిలిచిపోయింది?**
- **ప్రజాధనంతో చేపట్టిన పనులపై పర్యవేక్షణ ఎక్కడ?**
- **ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదు?**
- **ప్రజాధనం వృథా అయిందా..? గ్రామ భద్రతను గాలికొదిలేశారా..?**
- **తొమ్మిది కెమెరాలు ఏర్పాటు చేసినా.. నేడు ఒక్కటి కూడా లేకపోవడంపై గ్రామస్థుల ఆగ్రహం.**
- **బిల్లులు చెల్లించకపోవడంతో కెమెరాలు తొలగించుకున్నామని సంస్థ ప్రతినిధుల వ్యాఖ్యానమని గ్రామస్థుల ఆరోపణ**
- **పేరుకే సీసీ కెమెరాలు... ఇప్పుడు జాడే లేదు..!**
- **సర్పంచ్ నిర్లక్ష్యంతో గ్రామ భద్రత గాల్లో కలిసిందా..?**
- **ఆగ్రహంతో రగిలిపోతున్న గ్రామస్థులు.**



**సీసీ కెమెరా తొలగిస్తున్న దృశ్యం**




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లా, తూర్పు తండా గ్రామ పంచాయతీ: గ్రామ ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నేడు పూర్తిగా మాయమవ్వడంతో తూర్పు తండా గ్రామపంచాయతీలో తీవ్ర కలకలం రేగింది. ఒకప్పుడు "గ్రామమంతా సీసీ నిఘా" అంటూ ప్రచారం చేసిన గ్రామపంచాయతీలో ప్రస్తుతం ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తూర్పు తండా, చౌల్ల తండా, ధరావత్ తండా ప్రాంతాల్లో మొత్తం 9 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అప్పట్లో ప్రకటించారు. అయితే ఇటీవల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన సంస్థ ప్రతినిధులు గ్రామానికి వచ్చి వాటిని ఒక్కొక్కటిగా తొలగించి తీసుకెళ్లడం గ్రామస్థులు ప్రత్యక్షంగా చూశామని చెబుతున్నారు. దీనిపై గ్రామస్థులు వారిని ప్రశ్నించగా, "సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదు. ఎన్నిసార్లు సంప్రదించినా స్పందన లేకపోవడంతో మా సామగ్రిని వెనక్కి తీసుకెళ్తున్నాం" అని సంస్థ ప్రతినిధులు చెప్పినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలో భద్రత పూర్తిగా ప్రశ్నార్థకంగా మారిందని, రాత్రివేళల్లో జరిగే దొంగతనాలు, ఇతర ఘటనలను గుర్తించే వ్యవస్థనే కోల్పోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుడు బానోత్ నరేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా నిలబెట్టుకోలేని పరిస్థితి రావడం గ్రామపంచాయతీ పాలనకు నిదర్శనం. కెమెరాలు పెట్టించామని ప్రచారం చేసుకోవడం సులువు, కానీ వాటి బిల్లులు కూడా చెల్లించలేక చివరకు వాటిని తీసుకెళ్లే పరిస్థితి రావడం సిగ్గుచేటు. గ్రామ ప్రజల భద్రతను ఇలా నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు వెంటనే విచారణ జరిపి, కెమెరాలు ఎందుకు తొలగించబడ్డాయి? బిల్లులు ఎందుకు చెల్లించలేదు? ప్రజాధనం ఎలా వినియోగించారు? అనే అంశాలపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలి. బాధ్యులపై చర్యలు తీసుకొని గ్రామంలో వెంటనే సీసీ కెమెరాలను పునరుద్ధరించాలి" అని డిమాండ్ చేశారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో గ్రామ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# కేటీఆర్ జన్మదిన సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ భాగంగా హెల్మెట్ల పంపిణీ

**ముషీరాబాద్,విశాల భారతి:**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు వేడుకలను ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద మొక్కలు నాటి కేక్ కట్ చేసి అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ..ప్రతి వ్యక్తి హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని హెల్మెట్ ఎంతో సురక్షితమైనదనే ఉద్దేశంతో కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా గిఫ్టఏ స్మైల్ లో భాగంగా 50 హెల్మెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఐటీ శాఖ మంత్రిగా గతంలో పనిచేసి తెలంగాణ రాష్ట్రాన్ని హైదరాబాద్ ను ప్రపంచ పటంలో నిలిపినటువంటి గొప్ప వ్యక్తి కేటీఆర్ అని కొనియాడారు. హైదరాబాదుకు ఎన్నో కంపెనీలు తీసుకువచ్చి ఇక్కడ ఉపాధి కల్పించి అభివృద్ధి చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ ముదిరాజ్, జైర రాకేష్, పవన్ దేవాన్ష్, ప్రవీణ్, శేఖర్,బొబ్బిలి మహేష్, శరత్ గౌడ్, ప్రదీప్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు



# మహిళల కోరిక మేరకు ముప్పిరితోటకు బస్సు ప్రభుత్వ విప్ విజయరమణారావు



**విశాల భారతి పెద్దపల్లి :** రెండున్నర ఏళ్ల క్రితం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ముప్పిరితోట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు. గురువారం ముప్పిరి తోటలో డిపో మేనేజర్ కవిత తో కలిసి విప్ విజయ రమణారావు గోదావరిఖని నుండి ముప్పిరితోట మీదుగా గర్రెపల్లి వరకు నడిచే ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య చరిత్రలో ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో పాలకులు వచ్చినప్పటికీ పెద్దపల్లిలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు ప్రయత్నించిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి మెప్పించడం వల్లే 2024 డిసెంబర్ లో పెద్దపల్లి లో నిర్వహించిన బహిరంగ సభలో బస్సు డిపో ఏర్పాటుకు ప్రకటన చేశారని చెప్పారు. రానున్న రెండు మాసాల్లో దేవి నవరాత్రుల ఉత్సవాల్లో పెద్దపల్లిలో బస్సు డిపోను ప్రారంభం చేసుకొని నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలను కల్పిస్తామన్నారు. మాటతప్పే అలవాటు లేదని, ప్రజల అవసరాలను గుర్తించి నిరంతరం పనిచేస్తానని చెప్పారు. రూ.12కోట్ల నిధులతో ఈ గ్రామం మీదుగా నిర్మాణం చేపడుతున్న డబుల్ రోడ్డు పనులను రెండు మాసాల్లో పూర్తి చేయిస్తానన్నారు. గ్రామాల్లో ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు, ఆరు మాసాల్లో రాష్ట్రంలో మూడు లక్షల పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సర్పంచ్ మారం రాయమల్లు, తహసిల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్ రావు, నాయకులు రామిడి వెంకట్రామిరెడ్డి,సమా రాజేశ్వర్ రెడ్డి,సంతోష్రావు, వెంకటేశ్వర రావు, దేవురాజు, లాలయ్య,పలు గ్రామాల సర్పంచులు, మహిళలు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి దేవాలయాన్ని అద్భుతంగా నిర్మిస్తాం: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**విశాల భారతి గోదావరిఖని :** పట్టణంలోని మెయిన్ చౌరస్తాలోని పోచమ్మ తల్లి ఆలయాన్ని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ ద్వారా సుమారు రూ.40 లక్షల నిధులతో పోచమ్మ తల్లి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా, భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయ నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, అవసరమైతే అదనపు నిధులు సమకూర్చి పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.పోచమ్మ తల్లి ఆలయం ఈ ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ఆధునిక సదుపాయాలతో ఆలయాన్ని అద్భుతంగా నిర్మిస్తాం. నిర్మాణ వ్యయంలో ఎలాంటి వెనుకడుగు వేయం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం పోచమ్మ తల్లి దేవాలయ నూతన నిర్మాణానికి సంబంధించిన నమూనా చిత్రాన్ని (మోడల్ డిజైన్) ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, ఆర్జీ1 జీఎం లలిత్ కుమార్, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. 00

# సింగరేణి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**సింగరేణి అధికారులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష సమావేశం**



**విశాల భారతి గోదావరిఖని :** రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సింగరేణి అధికారులతో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గోదావరిఖని చౌరస్తాలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, సంబంధిత ప్రాంతాల్లో రహదారులను వెంటనే అభివృద్ధి చేయాలని ఆదేశించారు.అలాగే సింగరేణి ఖాళీ క్వార్టర్ల పరిసరాల్లో పెరిగిపోయిన చెట్లు, పొదలను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. ఖాళీ క్వార్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సింగరేణి పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్జీ 1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ తో పాటు సింగరేణి వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన లయన్స్ పిస్తా హౌస్

- **మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రారంభం**
- **ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యమని నిర్వాహకుల వెల్లడి**

**అబ్దుల్లాపూర్‌మెట్,విశాల భారతి :**




అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై చెరుకు శ్రీకాంత్ గౌడ్, రవి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లయన్స్ పిస్తా హౌస్ రెస్టారెంట్ ను తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం రెస్టారెంట్‌ను ప్రారంభించిన అతిథులు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. ఇటువంటి వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. వినియోగదారుల సంతృప్తినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని సేవలు అందిస్తే ప్రతి వ్యాపారం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలు ధైర్యంగా ముందుకు వచ్చి మరిన్ని ఉపాధి అవకాశాలు సృష్టించాలని కోరారు. రెస్టారెంట్ నిర్వాహకులు చెరుకు శ్రీకాంత్ గౌడ్, రవి కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఒక్కరికీ అందుబాటు ధరల్లో ఉత్తమమైన ఆహారాన్ని అందిస్తూ వినియోగదారుల ఆదరణకు అనుగుణంగా సేవలను మరింత విస్తరిస్తామని వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ముద్దగాని రామ్మోహన్ గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, లష్కర్‌గూడ గ్రామ సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్, అబ్దుల్లాపూర్‌మెట్ మాజీ సర్పంచ్ చెరుకు కిరణ్ గౌడ్, ఉప సర్పంచ్ అంతటి సుష్మ అశోక్ గౌడ్, నిమ్మల హరీష్ గౌడ్, సానేం పవన్ గౌడ్, చెరుకు గోవింద్‌రాజ్ గౌడ్, మొగుళ్ల జీవన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన రెస్టారెంట్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

- **బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుండెల్లి మధుకర్**

**ముషీరాబాద్,విశాల భారతి:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుండెల్లి మధుకర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటు హక్కు పరిరక్షించబడేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జాగ్రత్తగా ఓటు ను చూసుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం తార్నాక లోని నాగార్జున నగర్ కమిటీ హాల్లో ఓటర్ జాబితా సవరణ కేంద్రాన్ని సందర్శించి స్థానికుల ఓటర్ జాబితా ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితాలో మరణించిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా నివాసం మార్చుకున్న ఓటర్ల వివరాలకు సంబంధించిన వాటిని పరిశీలించారు. అనంతరం అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా తొలగించకుండా అత్యంత పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మధుకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కును కలిగి ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా ఓటు హక్కు పత్రాలను పూర్తి సమాచారంతో నింపి అధికారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కైలాష్, బంగారి సాయి, రాకేష్ తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ ఫారాలు తప్పనిసరిగా నింపండి

- **ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఐదు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు**
- **టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఓటరు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాలను నింపి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కి గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలు అందని ఓటర్ల సౌకర్యార్థం ఎల్బీనగర్ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సరూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం (మూడు సర్కిల్ కార్యాలయాలు), జోనల్ కార్యాలయం, నాగోల్ వార్డు కార్యాలయం, మన్సూరాబాద్ వార్డు కార్యాలయం, హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంల్లో ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ఏ ఓటరైనా ఈ కేంద్రాలకు వెళ్లి తమ ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు, అవసరమైన ఇతర పత్రాలతో అక్కడికక్కడే ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి సంబంధిత అధికారులకు అందజేయవచ్చని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమై దాదాపు నెల రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో, ఓటు హక్కును కాపాడుకునేందుకు మరో పది రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని మధుయాష్కి గౌడ్ గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని, హెల్ప్‌డెస్క్‌లలో లేదా తమ పోలింగ్ కేంద్ర పరిధిలోని బీఎల్ఓను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు నమోదును నిర్ధారించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు.

## జేపీ మోర్గాన్ ఉద్యోగి విష్ణువర్ధన్ రెడ్డి మృతి

**కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు, అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభం**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఓ యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఐటీ రంగంలో ఉద్యోగం చేస్తున్న 27 ఏళ్ల యువకుడు ఆకస్మికంగా మృతి చెందడం కుటుంబ సభ్యులు, సహచరుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, మబ్బు విష్ణువర్ధన్ రెడ్డి జేపీ మోర్గాన్ చేజ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన నానక్‌రామ్‌గూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. జూలై 22న సాధారణంగా విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్న ఆయన, భోజనం అనంతరం తన గదికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే జూలై 23 తెల్లవారుజామున అనూహ్యంగా అతను అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన కుటుంబ సభ్యులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారణ కావడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రమాదవశాత్తు పడిపోవడం, లేదా ఇతర కారణాల వల్ల మృతి సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నప్పటికీ, ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం మృతి కారణం స్పష్టమవుతుందని అధికారులు తెలిపారు. అలాగే అపార్ట్‌మెంట్ సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనతో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో ఆందోళన నెలకొనగా, యువకుడి మృతి పట్ల స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఐటీ ఉద్యోగుల భద్రత, పని ఒత్తిడి వంటి అంశాలపై కూడా చర్చ ప్రారంభమైంది.

## ఓల్డ్ అజీజ్‌నగర్ గేట్ వద్ద హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం

**రోడ్డు భద్రతకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి : ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ్**



**మొయినాబాద్, జూలై 23 (విశాలభారతి):** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో మొయినాబాద్ మండలంలోని ఓల్డ్ అజీజ్‌నగర్ గేట్ వద్ద రోడ్డు భద్రతపై హెల్మెట్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై సుమారు 70 మంది ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే తీవ్ర గాయాలకు గురవుతున్నారని, ప్రాణనష్టాలు కూడా సంభవిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే ప్రయాణికుడు కూడా తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలున్న హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలంటే హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. అనంతరం అర్హులైన ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బి. సతీష్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాచ్ ది రెయిన్‌తో నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

**మొయినాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జల్ సంచయ్ జన్ భాగీదారి–3.0 కార్యక్రమం**



**మొయినాబాద్, జూలై 23(విశాలభారతి):** తెలంగాణ సీడీఎంఏ ఆదేశాల మేరకు జల్ సంచయ్ జన్ భాగీదారి (JSJB)-3.0 కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అజీజ్‌నగర్, చిలుకూరు బాలుర గురుకుల పాఠశాలల్లో 'క్యాచ్ ది రెయిన్' (వర్షపు నీటిని పట్టుకుందాం) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ, నీటి వినియోగం, నీటి కాలుష్యంపై అవగాహన కల్పిస్తూ వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. అలాగే భూగర్భ జలాల రీఛార్జ్, ప్రతి ఇంట్లో ఇంగుడు గుంతల ఏర్పాటు అవసరం, నీటిని పొదుపుగా వినియోగించే పద్ధతులపై అధికారులు వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ప్రతి బొట్టునూ పొదుపు చేద్దాం - భవిష్యత్తును సురక్షితం చేద్దాం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వర్షాల కోసం అల్లాహ్‌ను వేడుకున్న ముస్లిం సోదరులు



- **బేతోలులో వనభోజనాలతో ప్రత్యేక దువాలు**
- **వర్షాలు సమృద్ధిగా కురవాలని వనభోజనాలతో ప్రత్యేక ప్రార్థనలు**
- **రైతు సంక్షేమమే లక్ష్యం... వర్షాలు సమృద్ధిగా కురవాలని బేతోలులో వనభోజనాలతో ప్రార్థనలు**
- **రైతాంగం సుభిక్షంగా ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థించిన ముస్లిం సోదరులు**
- **ఐకమత్యానికి బేతోలు గ్రామం నిలువెత్తు నిదర్శనం**

**మహబూబాబాద్ జిల్లా, విశాల భారతి:**

వ్యవసాయాధారిత దేశమైన భారతదేశంలో రైతు సంక్షేమం ప్రకృతి అనుగ్రహంపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మహబూబాబాద్ జిల్లా బేతోలు గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు గ్రామ శివారులో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక దువాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని అల్లాహ్‌ను ప్రార్థించారు. చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి పంటలకు తగినంత నీరు అందాలని, రైతులు అప్పుల బాధల నుంచి బయటపడి సంతోషంగా జీవించాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొనాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ, "రైతు నవ్వితేనే దేశం నవ్వుతుంది. ప్రకృతి కరుణిస్తేనే పంటలు పండుతాయి. అందుకే ఈ రోజు వర్షాలు సమృద్ధిగా కురవాలని, భూమాత పచ్చని పంటలతో కళకళలాడాలని, రైతు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాం. మతాలు వేర్వేరు అయినా మన లక్ష్యం ఒక్కటే. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో జీవించడం ఎంతో ఆనందంగా ఉంది. భగవంతుడు అందరిపై తన అపార కరుణ చూపించి రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురిపించాలని కోరుకుంటున్నాం" అని అన్నారు. వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో ముస్లిం సోదరులు చేపట్టిన ఈ ప్రత్యేక ప్రార్థనలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ కార్యక్రమం మత సామరస్యానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. అనంతరం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామ ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం అభివృద్ధి చెందాలని మరోసారి ప్రత్యేక దువాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ముస్లిం పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేయాలి – తల్లిదండ్రులు, గ్రామస్తుల ఆందోళన

**దిలీప్ రెడ్డి బదిలీని ఆపి మాధవిని బదిలీ చేయాలి అని కోరిన గ్రామస్తులు**

**దేవరుప్పల విశాలభారతి:**

దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో గత కొద్ది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు ధర్నాలు నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గురువారం గ్రామ సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, యువత, గ్రామ పెద్దలు పాఠశాల కు తాళం వేసి గ్రామంలోని ప్రధాని చౌరస్తా లో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూలులో ఉన్నది ఇద్దరు ఉపాధ్యాయులు అందులో ఎనిమిది సంవత్సరాల క్రితం వచ్చిన అర్రం రెడ్డి మాధవి వారి విద్యా బోధన సరిగా లేక పోవడమే కాకుండా విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించటం బూతులు తిట్టడం వలన ఇంతకుముందు ఎన్నోసార్లు నిరసనలు వ్యక్తం చేశాము ఆ ఉపాధ్యాయురాలును బదిలీ చేయకుండా కొత్తగా వచ్చిన దిలీప్ రెడ్డి ని బదిలీ చేస్తున్నారు. కావున మాధవి గారిని బదిలీ చేసి దిలీప్ రెడ్డి గారిని బదిలీ చేయకుండా నాణ్యమైన విద్య నేర్పించే ఉపాధ్యాయులు ఒకరిని నియమించి పాఠశాల పిల్లల అభివృద్ధికి చేయూత ఇచ్చి సహకరించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే ఉపాధ్యాయులను నియమించాలని విద్యా సంస్థలను వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "పిల్లల చదువుతో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులను కొనసాగించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది. ఇకపై అధికారులు ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.





## కార్మికుల హక్కులను పరిరక్షించాలి

**తెలంగాణ కార్మిక సమైక్య ఆవిర్భావ సభలో మాట్లాడిన వ్యవస్థాపక అధ్యక్షులు: కలకోటి రామన్న**



**ముషీరాబాద్,విశాల భారతి:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేసి వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలని తెలంగాణ కార్మిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు కలకోటి రామన్న డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కార్మిక సమాఖ్య ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ... రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత కార్మికులకు వంద గజాల స్థలంలో ఇళ్లు కట్టించి ఇవ్వాలని, రాష్ట్రంలో ఉన్న పోడు భూములు, సిలింగ్ భూములు, లావాణి పట్టా భూమికి పూర్తి హక్కులను ప్రభుత్వం కల్పించి ప్రతి పేదవారికి మూడు ఎకరాల సాగుభూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పించాలని, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే పారిశుధ్య, గ్రామ పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామిలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కోలా జనార్ధన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు నెమలి పులి నాగమణి, కె. లక్ష్మీ, రత్న కుమారి, పి. నారాయణ, స్వరాజ్యం, ముంతాజ్ బేగం, దైదా సాగర్, ఈశ్వర్, గణేష్, జి. శేఖర్, ఎన్. నీలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ విద్యార్థులకు మద్దతుగా నేడు బీఎస్పీ నిరసన

- **ట్యాంక్‌బండ్ ఆందోళనను విజయవంతం చేయాలి**
- **రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ పిలుపు**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నేడు హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శాంతియుత నిరసన కార్యక్రమానికి రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఎస్పీ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గ్యారం మల్లేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్యార మల్లేష్ మాట్లాడుతూ..నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందన్నారు. తమకు న్యాయం చేయాలని శాంతియుతంగా ఉద్యమిస్తున్న విద్యార్థులకు బహుజన్ సమాజ్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తోందని తెలిపారు.బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా నేడు ట్యాంక్‌బండ్ వద్ద జరిగే ఆందోళనకు రంగారెడ్డి జిల్లా నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాలని ఆయన కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఘటనలను బీఎస్పీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. నేడు ట్యాంక్‌బండ్ వద్ద జరిగే శాంతియుత నిరసన కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా పార్టీ నాయకులు, మండల, డివిజన్, గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, యువజనులు, విద్యార్థులు, బహుజన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గ్యారం మల్లేష్ విజ్ఞప్తి చేశారు.

## రాహుల్ గాంధీ అరెస్టు, నీట్ పేపర్ లీక్ ఘటనపై కాంగ్రెస్ నిరసన

**మొయినాబాద్ జూలై 23(విశాలభారతి:** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మొయినాబాద్ చౌరస్తా వద్ద భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. అదేవిధంగా, రాహుల్ గాంధీ అరెస్టును ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా అభివర్ణిస్తూ, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ చర్యలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును అణిచివేసే చర్యలను విరమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తొలి ఏకాదశికి స్వయంభు లక్ష పుష్పార్చన మహోత్సవం

- **జూలై 25న గౌరెల్లి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైభవంగా నిర్వహణ**
- **భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని చైర్మన్ నెల్లూరు రాజు పిలుపు**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గౌరెల్లి గుట్టపై వెలసిన శ్రీ స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు లక్ష పుష్పార్చన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ చైర్మన్ నెల్లూరు రాజు మరియు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ..సనాతన ధర్మంలో పుష్పార్చనకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. భక్తితో సమర్పించే ఒక పుష్పాన్ని కూడా భగవంతుడు ఆనందంగా స్వీకరిస్తాడని శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ ఉపదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. పుష్పార్చన ద్వారా మనస్సు ఏకాగ్రత పెరిగి, దైవచింతన పెరుగుతుందని, కుటుంబంలో శాంతి, సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆరోగ్యం, విద్య, ఉద్యోగం, వ్యాపారాభివృద్ధి వంటి మనోభీష్టాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. ప్రహ్లాదుడిని రక్షించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి తనను ఆశ్రయించిన ప్రతి భక్తుడిని కాపాడే కరుణామూర్తి అని తెలిపారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో నిర్వహించే లక్ష పుష్పార్చన భయాలను తొలగించి ధైర్యం, ఆత్మవిశ్వాసం, ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుందని వివరించారు. ఈ మహోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు రూ.501 సమర్పిస్తే వారి గోత్రనామాలతో లక్ష పుష్పార్చన నిర్వహించబడుతుందని తెలిపారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి దివ్య అనుగ్రహాన్ని పొందాలని దేవాలయ చైర్మన్ నెల్లూరు రాజు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ చెంచాల శ్రీనివాస్, డైరెక్టర్లు నిరుడు రాజు, గ్యార దివ్యదాస్, చెట్టిగారి రాజేష్ తదితరులు పాల్గొని, లక్ష పుష్పార్చన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని భక్తులకు విజ్ఞప్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# ఘనంగా మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రతిష్టాత్మక యువ చైతన్య వేదిక**
**యువత ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి తనయుడు యువనేత మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని యువతకు స్ఫూర్తినిచ్చే "యువ చైతన్య వేదిక" కార్యక్రమం గురువారం బొంగ్లూర్ క్రాస్ రోడ్‌లోని ప్రమీద గార్డెన్స్ వేదికగా ఘనంగా నిర్వహించారు. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి, ఆదిభట్ల ఏసిపి ప్రదీప్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసిపి కె పి వి రాజు, ప్రముఖ మోటివేషన్ స్పీకర్ ఆకెళ్ళ రాఘవేంద్ర, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (సీఈవో) కె నితిన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా, లక్ష్య సాధన దిశగా ముందుకు నడిపించేలా విలువైన సందేశాలను అందించారు. అంతేకాకుండా నేటి యువత అత్యంత అవసరమైన ఉద్యోగ అవకాశాలు, డ్రగ్స్ మహమ్మారి నిర్మూలన, సోషల్ మీడియాను సద్వినియోగం, యువత డ్రగ్స్, గంజాయి, ఆన్లైన్ గేమ్స్, పట్ల దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు తల్లిదండ్రుల గురించి, కన్నవారి గురించి ఆలోచిస్తూ ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లకు లోనై చదువును పక్కన పెట్టి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నప్పుడు మత్తు పదార్థాల జోలికి వెళ్ళరని, వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు అభినందనీయులన్నారు. చదువుతోపాటు సమాజంలో బాధ్యతాయుత పాత్ర పోషించాలని, వార్డులలో, కాలనీలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా వ్యవహరించాలన్నారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తూ జీవితాన్ని సర్వనాశనం చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, పి ఎస్ సి ఎస్ చైర్మన్ లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు, మున్సిపాలిటీ చైర్మన్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## సికింద్రాబాద్ సాయిబాబా ఆలయంలో ఘనంగా సప్తాహ ఉత్సవాలు ప్రారంభం



**సికింద్రాబాద్,విశాల భారతి :** పద్మారావు నగర్ సాయి వ్యాధి నివారణ ఆశ్రమంలో శ్రీ సాయి సప్తాహ ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక భక్తుల జయజయధ్వానాలు, వేదమంత్రోచ్చారణల మధ్య ఆధ్యాత్మిక శోభతో ఆలయ ప్రాంగణం పరవశించిపోయింది. వారం రోజులపాటు జరిగే ఈ ఆధ్యాత్మిక మహోత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ...... గురువారం నుంచి వారం రోజుల పాటు ప్రతి రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విశేష సేవలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల తొలిరోజే వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న సాయిబాబాకు స్వర్ణాభిషేకం, విఘ్నేశ్వర విభూతి సేవ నిర్వహించారు. వందలాది మందికి అన్నదానం నిర్వహించారు. భక్తులందరికీ సకల సౌకర్యాలు కల్పిస్తూ, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. రానున్న రోజుల్లో కూడా ఈ వేడుకలు మరింత వైభవంగా సాగుతాయని, భక్తులందరూ విశేషంగా పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**జీవో ఎంఎస్ నెం. 7, 8, 9లను రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్**




**మేడిపల్లి విశాల భారతి :** ఏఐఎస్ఎఫ్(ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ AISF) తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియం నుండి కలెక్టరేట్ వరకు సుమారు 3,000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించి, విద్యార్థుల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల సమస్య విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని అన్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు ₹7,000 కోట్ల బకాయిలకు, అనంతర కాలంలో పేరుకుపోయిన ₹4,000 కోట్లకు పైగా బకాయిలు కలిపి, ప్రస్తుతం ₹11,000 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద విద్యా శాఖ ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమస్యలపై ఎటువంటి సమీక్ష నిర్వహించకుండా లక్షలాది మంది విద్యార్థి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ సమస్యల పరిష్కారాలు గడప కూడా దాటడం లేదని ఎద్దేవా చేసారు. పేద విద్యార్థుల పట్ల ఏ మాత్రం ప్రేమ, చిత్తశుద్ధి ఉన్న తక్షణమే పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.

## బోనాల ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

**తోకల శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** ఈరోజు రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ ప్రగతి కాలనీలో నిర్వహించనున్న బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. డివిజన్ పరిధిలోని అన్ని దేవాలయాల్లో బోనాల ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దేవాలయాలకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆ. కృష్ణ యాదవ్, రావుల భాస్కర్, ప్రతాప్ రెడ్డి, దాసు, చిన్న అక్కెం జంగయ్య యాదవ్, సురేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల న్యాయం కోసం కాంగ్రెస్ శాంతియుత పోరాటం – కేంద్రంపై గట్టి విమర్శలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** నెక్నాంపూర్, మణికొండ: విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నెక్నాంపూర్ & మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ రోజు ఈఐపీఎల్ కార్నర్‌స్టోన్ జంక్షన్ వద్ద శాంతియుత ధర్నా విజయవంతంగా నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళులర్పిస్తూ, కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో 152కు పైగా పరీక్షా పేపర్ లీకులు జరిగాయని ప్రతిపక్షం ఆరోపిస్తోందని తెలిపారు. ఈ తరహా ఘటనల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, పరీక్షా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం దెబ్బతినడం ఆందోళనకరమని అన్నారు. పరీక్షల్లో పారదర్శకతను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశవ్యాప్తంగా పరీక్షల భద్రతకు శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై గళమెత్తుతున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, ప్రజల గొంతును అణచివేయాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. విద్య, ఉపాధి, యువత భవిష్యత్తు విషయంలో రాజీ పడబోమని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు మరియు ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## పిప్రిలో 'జల సిరి' పనులను ప్రారంభించిన ఎంపీడీఓ

**విశాల భారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మండల పరిధిలోని పిప్రి గ్రామ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "జల సిరి" పథకం పనులను గురువారం రోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ ఎంపీడీఓ బాలే శివాజీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పిప్రి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఈసీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ల సమక్షంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కమ్యూనిటీ ఇంకుడు గుంత, రైతు వేదిక భవనంపై రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, అలాగే కమ్యూనిటీ ఇంకుడు గుంత, డ్రైనేజీ కామన్ ఇంకుడు గుంతల గుర్తింపు పనులను అధికారికంగా ప్రారంభించారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ ధర్నా



**రాహుల్, ప్రియాంక గాంధీలకు మద్దతు – కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హయత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నగౌని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలు చేపడుతోందని నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ రాజు పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసనకు సంఘీభావం ప్రకటించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ధర్నా సందర్భంగా కార్యకర్తలు "మోడీ హటావో - దేశ్ బచావో", "మోడీ డౌన్ డౌన్", "జై కాంగ్రెస్ పార్టీ", "జై జై కాంగ్రెస్ పార్టీ" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నదని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా చెన్నగౌని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రతిపక్షాల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణిని విడనాడాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలకు రవీందర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు గజ్జి శ్రీనివాస్ యాదవ్ తో పాటు యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నిరసన



- **మన్సూరాబాద్ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం**
- **బొడిగె స్వామి గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆందోళన**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బొడిగె స్వామి గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మన్సూరాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు .ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు బొడిగె స్వామి గౌడ్, యువనేత జక్కిడి సత్యతేజ రెడ్డి మాట్లాడుతూ.. నీట్ పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటన దేశ విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన కేంద్ర ప్రభుత్వం దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నైతిక బాధ్యత స్వీకరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని కోరారు.విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా చేపట్టిన నిరసనపై పోలీసులు లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు .ఈ నిరసన కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ రెడ్డి, సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ అబ్జర్వర్ పోచబోయిన వినోద్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, విఠల్ రెడ్డి, రాజశేఖర్, గిరి, లింగం యాదవ్, శ్రీకాంత్, జాకీర్, నజీర్, ఆంజనేయులు, వెంకట స్వామి గౌడ్, కృష్ణ గౌడ్తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఆశలన్నీ రేవంత్ రెడ్డి పైనే

**మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు చేయాలి మల్లోజుల శ్రీనివాసచారి**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ఉద్యమకారుల ఆశలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైనే ఆధారపడి ఉన్నాయని, ఎన్నికలలో ఇచ్చిన మేనిఫెస్టోను వెంటనే అమలు చేయాలని తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర కోశాధికారి మల్లోజుల శ్రీనివాస చారి కోరారు. తెలంగాణ రాష్ట్రం 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, వేలాది మంది ఉద్యమకారులు, అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందని అన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కే.కే. కమిటీని ఏర్పాటు చేసి చర్చలు జరపడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఉద్యమకారులకు న్యాయం చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ కేసులతో సంబంధం లేకుండా గుర్తింపు కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన బెల్లి లలితక్క మారోజు వీరన్న కోనపురి సాంబశివుడు రాములు మరి ఎంతోమంది ఉద్యమంలో పనిచేసి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించినటువంటి వారి కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమైనాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఈ అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులను స్వరాష్ట్ర పోరాట యోధులుగా గుర్తించి నెలకు రూ.25 వేల పెన్షన్ మంజూరు చేయాలని అన్నారు. ఉద్యమ నాయకులపై నమోదైన కేసులను ఎత్తివేసి, జైలులో ఉన్న నాయకులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. మహిళ ఉద్య మకారులకు ప్రభుత్వ శాఖల్లో ప్రత్యేక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని, లేకపోతే మరో ఉద్యమానికి దారి తీసే పరిస్థితులు ఏర్పడతాయని మల్లోజుల శ్రీనివాస్ చారి హెచ్చరించారు.

## మంచాల మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులుగా మంచాల రవి

- **సర్పంచుల సమస్యలు ఉంటే పరిష్కరించే దిశగా కృషి చేస్తా**
- **మండల నూతన అధ్యక్షులు జపాల సర్పంచ్ మంచాల రవి**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** మంచాల మండలం సర్పంచ్ ఫోరం మండల కార్యవర్గ సమావేశాన్ని గురువారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జాపాల సర్పంచ్ మంచాల రవిని, మంచాల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నేనావత్ బాలకృష్ణ (రంగాపూర్),ఉపాధ్యక్షులుగా పాత్లోతు శ్రీనివాస్ నాయక్ (బండలేమురు),కార్యదర్శి ఆంగోత్ రఘురాం (లోయపల్లి), సహాయ కార్యదర్శి ఆంగోతు రాణి శ్రీనివాస్ (ఆంగోత్ తండ) కోశాధికారి బత్తుల శృతి కరుణాకర్ రెడ్డి (నోముల),కార్యవర్గ సభ్యులుగా వివిధ గ్రామాల సర్పంచులను ఎన్నుకున్నారు.

## రాహుల్ గాంధీకి సంఘీభావంగా కాంగ్రెస్ నిరసన ర్యాలీ: ర్యాల రాజేందర్ యాదవ్



**సికింద్రాబాద్, విశాల భారతి :** ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన శాంతియుత నిరసనకు సంఘీభావం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి అదం సంతోష్ కుమార్ నాయకత్వంలో సంఘీభావ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో, మెట్టుగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెట్టుగూడ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ అణిచివేత విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## పోలీసుల విధులకు ఆటంకం

**విశాల భారతి, ఇందల్వాయి :** ఇందల్వాయి మండలంలోని తిరుమలయ్య తండా-మేఘ్యానాయక్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో భార్యాభర్తల కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన ఘటనలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన కేసులో 10 మందిని అరెస్టు చేసినట్లు ఇందల్వాయి ఎస్సై బి. సుమలత తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, కుటుంబ కలహాలపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో తిరుమలయ్య తండాకు చెందిన కొందరు గ్రామస్థులు పోలీసుల విధులను అడ్డుకోవడంతో పాటు పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులను గుర్తించి గురువారం 10 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ విధుల్లో ఉన్న అధికారులను అడ్డుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

## డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని

# మార్చుకోను

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని నేను ఎప్పుడూ రాజీ పడను. తెరపై బోల్డ్ సీన్స్ చేయాల్సిన అవసరం ఉందని నేను భావించను అని కాజల్ స్పష్టం చేశారు. తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని కూడా ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, తన నటించిన పాత్రల గురించి భవిష్యత్తులో తన బిడ్డకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో కథలు, పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నా కొడుకు నా సినిమాలు చూసి గర్వపడాలి. అతను అసౌకర్యంగా ఫీలయ్యే పాత్రలు నేను చేయాలనుకోవడం లేదు. అందుకే ఇప్పుడు ప్రతి కథను చాలా ఆలోచించి ఎంపిక చేసుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల 'టాక్సిక్' సినిమాలో యశ్‌తో కలిసి నటించిన కియారా అద్వానీ రొమాంటిక్ సన్నివేశాలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగిన నేపథ్యంలో కాజల్ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్ అవుతున్నాయి. పెళ్లి తర్వాత హీరోయిన్లు బోల్డ్ సీన్స్ చేయడంపై జరుగుతున్న చర్చల మధ్య కాజల్ తన వ్యక్తిగత విలువలను మరోసారి స్పష్టం చేయడంతో నెటిజన్లు ఆమె అభిప్రాయాలపై భిన్నంగా స్పందిస్తున్నారు. కాజల్ ప్రధాన పాత్రలో నటించిన 'ది ఇండియా స్టోరీ' జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుండగా, తెలుగులో ఆమె ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న NBK111 చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. దీంతో మరోసారి తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు కాజల్ సిద్ధమవుతున్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.